
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 10 9.08.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• ఇదీ నెల్లూరు



# నగరం కాదు.. నరకం

## కార్పొరేషన్‌లో అవినీతి ముదిరింది - అభివృద్ధి మురిగింది

## అస్తవ్యస్తమైన ట్రాఫిక్ - అష్టకష్టాలు పడుతున్న పబ్లిక్

"ఏ దిక్కు వెతికినా ఏమున్నది గర్వకారణం... మురుగు గుంటలు, దుర్గంధభూయిష్టమైన కాలనీలు, అక్రమ కట్టడాలు, కోట్లకొద్దీ దోమలు, గతుకుల రోడ్లు, అదుపులేని ఆక్రమణలు, పార్కింగ్ వ్యవస్థ లేని వ్యాపార సముదాయాలు, అవినీతిలో మునిగిపోయిన కార్పొరేషన్ అధికారులు, నియంత్రణ లేని ట్రాఫిక్, మామూళ్లతో సరిపెట్టుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు, కొట్లాటలు, హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, మానభంగాలు, కిడ్నాపులు... వీటికి సాక్షీభూతంగా స్వార్ధ పూరిత ఆధిపత్య రాజకీయాలు. గడచిన అయిదేళ్లుగా ఇదీ నా నెల్లూరు ముఖచిత్రం"...

అంటూ రాసుకున్నాడు ఓ కవి.

అది చదివినవారికి ఎవరికైనా అవునుకదా! ఇది నిజమే కదా? అని అనిపించక మానదు.

10 లో




# తప్పులు తగలబడుతున్నాయి

## కుప్పలుతెప్పలుగా ఫైళ్ళు

## కుప్పతొట్లలో ప్రత్యక్షమవుతున్నాయి



తెలుగు రాష్ట్రాల చరిత్రలో కనీవినీ ఎరుగని విచిత్ర పరిణామాలు ఇప్పుడు ఆంధ్రాలో చోటు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ పాలకులు, వారి నీడలో అధికారులు చేసిన తప్పులని తప్పించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాలని సైతం అగ్నికి ఆహుతి చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెలలోపే మంటల్లో కాలి బూడిదైపోయిన మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయం సంఘటనపై ఓ వైపు దర్యాప్తు జరుగుతుండగానే, మరోవైపు అనేక ప్రభుత్వ విభాగాలలోని ఫైళ్లు కుప్పలు తెప్పలుగా కుప్పతొట్లలో ప్రత్యక్షమవుతున్నాయి.

రాష్ట్రంలో అనేకచోట్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలపై గట్టినిఘా ఉంచేలా భద్రత పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బహుశా భారతదేశంలో ఏ రాష్ట్రం ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొని ఉండదు. ఎన్నికలు జరగడం, ప్రభుత్వాలు మారడం సర్వసాధారణం. కానీ ఇలా గత ప్రభుత్వ నేతలు తమ తప్పులని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో కార్యాలయాలని కాల్చడం,

3 లో



# ఆరునెలల్లో ఫిషింగ్ హార్బర్‌ను పూర్తిచేస్తాం

## ➤ జువ్వలదిన్నెలో ఇద్దరు మంత్రుల హామీ



జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్‌ను ఇటీవల ఇద్దరు మంత్రులు సందర్శించి, మరో ఆరునెలల్లోనే అక్కడ ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలను పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిలు ఇటీవల టీడీపీ నేతలు బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ తదితరులతో కలసి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఆ తర్వాత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి జనార్దన్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ, 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రామాయపట్నం పోర్ట్ నిర్మాణానికి, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు శ్రీకారం చుట్టారన్నారు. 4929 కోట్ల వ్యయంతో పోర్ట్ నిర్మాణం చేపట్టగా, ఇప్పటివరకు రూ.1300 కోట్లతో 51శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. ఈ పనులను వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన వివరాలన్నింటిపై నివేదిక తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు మెరుగైన బోట్లు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం నుండి మత్స్యకారులకు ఏమేమి అభివృద్ధి పనులు చేయగలమో అవన్నీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసిన అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, ఫిషింగ్ హార్బర్‌నే కాక, రామాయపట్నం పోర్టును, దగదర్తిలో విమానాశ్రయాన్ని కూడా పూర్తిచేసి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తామని మంత్రి ఆనం చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నెల్లూరుజిల్లాకు అనేక పెట్టుబడులు రానున్నాయన్నారు. తద్వారా యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ విషయాలన్నింటిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి రాష్ట్రాభివృద్ధిని సాధించేందుకు తమ వంతు కృషి చేస్తామని మంత్రి ఆనం అన్నారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఐఅండ్ఐ సెక్రెటరీ సురేష్ కుమార్, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, జిల్లా కలెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## విమానాశ్రయం శంకుస్థాపన స్థలం పరిశీలన

దగదర్తి వద్ద 2019 జనవరి 6న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంతర్జాతీయ విమానాశ్రయం కోసం శంకుస్థాపన చేసిన స్థలాన్ని, శంకుస్థాపన సమయంలో వేసిన స్థూపాన్ని మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల పరిశీలించారు. రానున్న రోజుల్లో ఈ విమానాశ్రయాన్ని కూడా నిర్మింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఇన్చార్జి ఎస్ఇ మురళీకృష్ణ, ఆర్డీవో శీనానాయక్, ఏపీ మారిటైం బోర్డు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

### రాష్ట్రంలో ఏర్పాటవుతున్న

# వైద్య కళాశాలల వివరాలేమిటి?

### లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలు



కేంద్ర ప్రభుత్వ పథకం 'ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ న్యూ మెడికల్ కాలేజస్ అటాచ్డ్ విత్ ఎక్జిస్టింగ్ హాస్పిటల్/డిస్ట్రిక్ట్' కింద ఏపీలో కాలేజీల ఏర్పాటుకు సంబంధించి ఇటీవల లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ పథకం కింద ఏర్పాటవుతున్న వైద్యకళాశాల పరిస్థితి ఏమిటని అడిగారు. అందుకు, కేంద్ర సహాయమంత్రి అనుప్రియ పటేల్ లిఖితపూర్వకంగా సమాధానం చెప్తూ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రైవేట్ వైద్య కళాశాలలు లేని ప్రాంతాలు, జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తూ 'ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ న్యూ మెడికల్ కాలేజస్ అటాచ్డ్ విత్ ఎక్జిస్టింగ్ హాస్పిటల్ డిస్ట్రిక్ట్' అనే కార్యక్రమం కింద కేంద్ర ప్రాయోజిత పథకాన్ని (సిఎస్ఎస్) నిర్వహిస్తోందన్నారు. ఈ పథకం కింద మొత్తం 157 మెడికల్ కాలేజీలకు మూడు దశల్లో అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. మూడో దశను 2019 ఆగస్టులో ప్రారంభించామని, పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నం, ఏలూరు, మార్కాపురం, పులివెందుల, విజయనగరంలలో వైద్య కళాశాలల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఏడు ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వీటిల్లో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నం ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం లభించిందన్నారు.

### ఉదయగిరి దర్గా అభివృద్ధికి..

# విపిఆర్ రూ.5లక్షల విరాళం



ఉదయగిరి దర్గా అభివృద్ధికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) ఇటీవల 5 లక్షల రూపాయల విరాళాన్ని అందజేసి ముస్లిం సోదరుల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు.. ఉదయగిరి పట్టణంలో ఉన్న అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ దర్గా 219వ గంధ మహోత్సవంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి విపిఆర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, 219 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఆనందంగా ఉందన్నారు. అల్లా ఆశీస్సులు, ఖాదర్ ఖాన్ సాహెబ్ దీవెనలు ఉదయగిరి ప్రజలపై ఎప్పుడూ ఉంటాయన్నారు. ఉదయగిరి ప్రజలకు ఎన్నికల్లో తామిచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. అనంతరం దర్గా అభివృద్ధికి ఆయన రూ.5లక్షల విరాళం అందజేశారు. దర్గా పరిసర ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేని విషయం తన దృష్టికి వచ్చిందని, వాటిని కూడా ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అదేవిధంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్గా అభివృద్ధికి లక్ష రూపాయలు అందించారు. దర్గా అభివృద్ధికి భారీ విరాళం అందించిన ఎంపీ వేమిరెడ్డికి, ఎమ్మెల్యే కాకర్లకి దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు ధన్యవాదాలు తెలిపారు.

### ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో..

# ఎట్టకేలకు వవ్వేరుకు బస్సు

### 30 ఏళ్ళ కల.. సాకారమైన వేళ!..




కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో దాదాపు ముప్ఫైఏళ్ళ తరువాత వవ్వేరు గ్రామానికి ఇటీవల ఆర్టీసీ బస్సు సౌకర్యం కలగడంతో గ్రామస్తులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని వవ్వేరు గ్రామానికి గత ముప్ఫై సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేదు. గ్రామస్థులు ఎక్కడకి వెళ్ళాలన్నా ఆటోలపై ఆధారపడి రాకపోకలు సాగించాల్సిందే, మరో ప్రత్యామ్నాయం ఉండేది కాదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రశాంతిరెడ్డి వవ్వేరుకు వచ్చినప్పుడు, తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వవ్వేరు వాసులు ఆమెతో మొరపెట్టుకున్నారు. తాను విజయం సాధిస్తే వవ్వేరుకు తప్పకుండా బస్సు వేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆమె కోవూరు ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించడంతో, ప్రజలకు తామిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా వవ్వేరు గ్రామానికి బస్సు సౌకర్యం లేని విషయాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు వవ్వేరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో వవ్వేరు ప్రజలు, ముఖ్యంగా నిత్యం ఆటోల్లో స్కూళ్ళకు వెళ్ళి చదువుకునే విద్యార్థినీ విద్యార్థులంతా ఎంతో సంతోషించారు. బుచ్చిరెడ్డిపాళెం తెలుగుదేశం పార్టీ రూరల్ మరియు అర్బన్ మండల అధ్యక్షులు బత్తుల హరికృష్ణ, ఎంవి శేషయ్యలతో పాటు స్థానిక టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ చిరమన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. తమకు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి, నెల్లూరు డిపో-1 మేనేజర్ మురళికి వవ్వేరు వాసులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.



### తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు

# భారీ ఏర్పాట్లు

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానాల వారు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబరు 4వ తేది ధ్వజారోహణంతో అత్యంత వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ప్రధానమైన సేవల్లో.. గరుడసేవ 8న జరుగుతుంది. 9న స్వర్ణరథోత్సం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం ఉత్సవాలు జరుగుతాయని ఆలయవర్గాలు తెలిపాయి.

# ఎన్నికల విధులకు వెళ్ళొచ్చిన.. తహశీల్దార్లకు పోస్టింగ్‌లు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా నుంచి ఇతర జిల్లాల్లో విధుల నిర్వహణకు బదిలీపై వెళ్ళిన తహశీల్దార్లు మళ్లీ జిల్లాకు తిరిగొచ్చారు. వారికి జిల్లా కలెక్టర్ ఆనంద్ మండలాలను కేటాయిస్తూ పోస్టింగులు ఇచ్చారు. పలువురు డెప్యూటి తహశీల్దార్లను తహశీల్దార్లుగా నియమించారు. జి.రాఘవేంద్రరావును నెల్లూరు ఆర్డీఓ కార్యాలయానికి, డి.లాజరస్‌ను నెల్లూరు రూరల్‌కు, ఎస్‌కె షఫీమాలిక్‌ను నెల్లూరు అర్బన్‌కు తహశీల్దార్లుగా నియమించారు. టి.విజయ కుమార్‌ను కలెక్టరేట్ ఏఓగా నియమించారు. పి.శాంతకుమారి, ఎస్.శ్రీనివాసులు రెడ్డి, ఎంవికె సుధాకర్‌రావు, పి.విజయ కుమార్, పి.శ్యామలమ్మలను కలెక్టరేట్‌లో నియమించారు. ఎన్.రమాదేవి, టి.శ్రీనివాసులు, కె.రాజ్యలక్ష్మిలను స్పెషల్ తహశీల్దార్లుగా, సి.రవీంద్రబాబును నెల్లూరు ఐటీడీఏ ఏపీఓగా నియమించారు. ఏ.నిర్మలానందబాబాను కోవూరుకు, ఏ.వెంకటేశ్వర్లును బుచ్చిరెడ్డిపాళెంకు, ఎం.పద్మజను తోటపల్లిగూడూరుకు, ఎన్.శ్రీనివాసులును వెంకటాచలంకు, సిహెచ్ సుబ్బయ్యను మనుబోలుకు, ఎం.శ్యామ్‌సుందరరాజాను రాపూరుకు, ఎం.నిరంజన్‌ను ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి, వి.సుధీర్‌ను ఆత్మకూరుకు, ఏవీ రమణరావును చేజర్లకు, డి.శ్రీరామకృష్ణను ఏఎస్‌పేటకు, బి.సోమ్లా నాయక్‌ను సంగంకు, కె.వీరవసంతరావును అనంతసాగరానికి, ఎం.సుభద్రను ఉదయగిరికి, ఆర్.సూర్యనారాయణసింగ్‌ను కావలి ఆర్డీఓ కార్యాలయానికి, పి.హేమంత్ కుమార్‌ను జలదంకికి, వై.నాగరాజును దుత్తలూరుకు, కె.స్ఫూర్తిని కొడవలూరుకు, కె.చంద్రశేఖర్‌ను విడవలూరుకు, ఎస్ఎం హమీద్‌ను వింజమూరుకు, టి. శ్రీనివాసులును కందుకూరు సబ్ కలెక్టరేట్‌కు, సయ్యద్ ఇక్బాల్‌ను కందుకూరుకు, ఇ.రమాదేవిని లింగసముద్రానికి, వి.లావణ్యను ఉలవపాడుకు, ఎస్‌కె అబ్దుల్‌హమీద్‌ను వలేటివారిపాళెంకు, కెవిబిటి సుందరమ్మను కొండాపురానికి, ఎస్ఎండి హుస్సేన్‌ను వరికుంటపాడుకు, టివిఎం కృష్ణప్రసాద్‌ను ఇందుకూరుపేటకు, ఏ.లక్ష్మీనారాయణను అల్లూరుకు, పి.శ్రావణ్‌కుమార్‌ను కావలికి, జి.స్వర్ణను గుడ్లూరుకు, జె.స్వప్నను మర్రిపాడుకు, ఎం.సారంగపాణిని పొదలకూరుకు, ఎం.సురేష్‌బాబును బోగోలుకు తహశీల్దార్లుగా నియమించారు. ఐఎస్ ప్రసాద్, పి.అనూరాధ, పి.లక్ష్మీనరసింహంలను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు.

గత వైకాపా పాలనలో, అధికారం ఉంది కదా అని పథకాల పేరుతో ప్రజాధనాన్ని కోట్లరూపాయాల్లో దిగమింగేసిన వారికి ఇప్పుడు చెమటలు పడుతున్నాయి. జగనన్న కాలనీల వంటి పథకాల పేరుచెప్పి, అటు కాంట్రాక్టర్లు ఇటు నాయకులు కుమ్మక్కై అందినకాడకి దోచేసుకున్నారని, ఆ అవినీతి అంతా ఇంతా కాదని, ఆ బాగోతాలన్నిటిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేయడం, సీఎం వెంటనే స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో జిల్లాలోని ఆ అవినీతి జలగల్లో కలకలం రేగుతోంది. ఇంతకాలం కూడబెట్టుకున్న అవినీతి తుట్టెలు కదలడంతో..అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

# 'జగనన్న కాలనీ'ల పేరుతో.. అంతా దోపిడీయే!

## సోమిరెడ్డి ఫిర్యాదుతో.. కదలనున్న 'అవినీతి తేనెతుట్టె'

- రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు
- వణికిపోతున్న అక్రమార్కులు



జనం డబ్బు దోచుకున్న అవినీతి రాకాసుల భరతం పట్టాలంటూ సోమిరెడ్డి పట్టుపడుతుండడంతో జిల్లాలోని అవినీతి పరులు వణికిపోతున్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీల పేరుతో అడ్డంగా దోచేసుకున్న నాయకులు, కాంట్రాక్టర్లు ఎక్కడ తమ అవినీతి బయటపడుతుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇంతకాలం ప్రజాధనాన్ని నిలువునా స్వాహా చేసేసి, కోట్లాదిరూపాయల అక్రమార్జనతో విర్రవీగుతున్న వారి బండారాలు విజిలెన్స్ విచారణలో తేలబోతున్నాయి. గత వైకాపా పాలనంతా దోపిడీల పర్వమేనని, 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' అంటూ ప్రజలను మోసం చేసి కోట్లాది రూపాయలు తినేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇటీవల ఫిర్యాదుచేయడం జిల్లాలో సంచలనం కలిగిస్తోంది. జిల్లాలో గత వైకాపా ప్రభుత్వం 85,344 ఇళ్లు మంజూరు చేస్తే, వాటిలో ఆప్షన్–3లో 29,238 ఇళ్ళ నిర్మాణాల బాధ్యతను 180 మంది కాంట్రాక్టర్లకు అప్పగించారని, అయితే వాటిలో 1024 ఇళ్లు ఇప్పటికీ ప్రారంభం కాలేదని సోమిరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి వివరాలను ఆరా తీస్తుండడంతో సంబంధిత అవినీతిపరుల్లో వణుకు మొదలైంది.

### దొంగ బిల్లులపై కూడా ఫిర్యాదు!

ప్రభుత్వం మంజూరు చేసిన పనులను చేయకుండానే చేసినట్లు చూపించి ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే సుమారు 150 నుంచి 200కోట్ల రూపాయల దాకా బిల్లులు డ్రా చేసుకొని సొమ్ములు దిగమింగేశారని, ఈ విషయంపై కూడా విచారణ జరపమని సోమిరెడ్డి ముఖ్యమంత్రిని కోరగా, ఆయన అందుకు అంగీకరించినట్లు కూడా సమాచారం.



# మన ఎంపీలకు.. ఢిల్లీలో సన్మానం

తెలుగు రాష్ట్రాల నుండి ప్రాతినిథ్యం వహిస్తూ లోక్‌సభలో తమ వాణిని వినిపిస్తున్న మన పార్లమెంట్ సభ్యులను ఈనెల 6న డిల్లీ ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అందులో మన నెల్లూరీయులైన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలు ఘన సన్మానాలందుకున్నారు. ఆంధ్రా అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోటగిరి సత్యనారాయణ, మంచిరాజు లహరి, మేనేజింగ్ ట్రస్టీ ఆర్.మణినాయుడు, ట్రెజరర్ ఎస్‌విఎస్ రావు, కార్యదర్శి నజీర్‌జాన్, కార్యవర్గసభ్యుడు శ్రీధర్ తదితరులు పాల్గొని ఎంపీలను సత్కరించారు.



స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు 99వ జయంతి సందర్భంగా ఆగస్టు 4న అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మండలి బుద్ధప్రసాద్ నుండి 'తెలుగువైభవం' పురస్కారాన్ని అందుకుంటున్న మన నెల్లూరీయుడు.. డిఆర్‌డిఓ మాజీ ఛైర్మెన్ డా. గుండ్రా సతీష్‌రెడ్డి.

# వెంకయ్య నెల్లూరు పర్యటన



భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈనెల 8న నెల్లూరుకు వచ్చారు. 9వతేది శుక్రవారం గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాలలో జరిగే ఏ.శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సి.రాధాకృష్ణారెడ్డిల విగ్రహావిష్కరణలో పాల్గొని, 'డాక్టర్ సీఆర్‌రెడ్డి జీవనప్రస్థానం' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. 10న వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ అడ్మిన్‌బ్లాక్‌లో జరిగే పూజల్లో పాల్గొని, ఆ తర్వాత చీరాలకు వెళ్తారు. మళ్లీ ఆగస్టు 14న నెల్లూరుకు వచ్చి, 15న వెంకటాచలంలోని అక్షరవిద్యాలయంలో జరిగే స్వాతంత్ర్యదినోత్సవ సంబరాల్లో పాల్గొంటారు. 16న నెల్లూరు టౌన్‌హాలులో పోలూరు హనుమజ్జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 17న స్వర్ణభారత్ ట్రస్ట్ 23ఏళ్ళ సేవాప్రస్థానంలో భాగంగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో కలసి స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 19న తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

## ఎంఆర్ ప్రసాద్‌కి..పోలూరు వారి పురస్కారం

ప్రముఖ సాహితీవేత్త, నెల్లూరు పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ (ఎంఆర్ ప్రసాద్)కు ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ పోలూరు హనుమజ్జానకీరామశర్మ పురస్కారం లభించింది. భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు గురువైన పోలూరు వారి పేరిట తెలంగాణ సారస్వత పరిషత్ వారు ఏటా అవార్డును ఇస్తున్నారు. ఈసారి ఆ అవార్డు ఎంఆర్‌ప్రసాద్‌కు లభించడం విశేషం. ఈనెల 16న నెల్లూరు టౌన్‌హాలులో జరిగే కార్యక్రమంలో ఆ అవార్డును వెంకయ్యనాయుడు సమక్షంలో ఆయనకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ క్షేత్రప్రచారశాఖ అధికారి పరవస్తు నాగసాయి సూరి ఈనెల 7న ఎంఆర్‌ప్రసాద్‌ను కలసి అభినందించారు.

# తప్పలు తగలబడుతున్నాయి

(మొదటిపేజీ తరువాయి)

ఫైళ్లని మాయం చేయడం, దస్త్రాలని ధ్వంసం గావించడం వంటి సంస్కృతి మనం ఎక్కడా వినలేదు చూడలేదు. తొలిసారిగా మన ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంప్రదాయం మొదలుకావడం విశేషం. బహుశా భవిష్యత్తులో ఇది పక్క రాష్ట్రాలకి కూడా పాకుతుందేమో!

ఒక మంత్రికి సంబంధించిన ఫోర్జరీ కేసులో ఏకంగా నెల్లూరుజిల్లా కోర్టునుండే సాక్ష్యాలు మాయం చేసిన ఘనచరిత్ర గత ప్రభుత్వ నాయకులకి ఉంది. అదే తరహాలో ఇప్పుడు తమ తప్పులని తగలబెట్టడానికైనా, అక్రమాలకి సంబంధించిన సాక్ష్యాలని మాయం చేయడానికైనా గత పాలకులు సందేహిస్తారని మనం అనుకోవలసిన పని లేదు. కోర్టులనే లెక్కచేయని వారికి, ప్రభుత్వ కార్యాలయాలెంత...?

కలికాలం అంటే ఇదే కాబోలు...!

# డీకేడబ్ల్యు కళాశాల అభివృద్ధికి సహకరించండి

## పూర్వ విద్యార్థినులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి విన్నపం



నెల్లూరులోని డీకేడబ్ల్యు కళాశాల అభివృద్ధికి ఈ కళాశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థినులు తమవంతు సహకారం అందించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆయన ఆ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు స్కూల్‌బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల ప్రగతికి ప్రభుత్వం చేయూతనిస్తోందని, ప్రభుత్వం పక్షాన విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కాలేజీలో చదువుకున్న వేలాదిమంది విద్యార్థినులు ఇప్పుడు జిల్లాలోనే కాక, రాష్ట్రంలోను, దేశంలోనూ ఇతర దేశాల్లో కూడా ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని, వారంతా సహకరించి, వారు చదువుకున్న ఈ కళాశాల అభివృద్ధికి అండదండలందించాలని ఆయన కోరారు. ఇటీవల కళాశాల ఆర్ఐఓ పిలుపు మేరకు స్పందించిన ఈ కళాశాల పూర్వ విద్యార్థినులు 36 రోజుల్లోనే దాదాపు రూ.8 లక్షలను అందజేయడం పట్ల ఎమ్మెల్యే ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ, వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీతో పాటు, టీడీపీ నాయకుడు రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



లాయర్
ఆగస్టు 09, 2024

# మృత్యుఘంటికలు మోగిస్తున్న..వరద భీభత్సాలు

ప్రకృతి విపత్తులు దేశాన్ని అల్లకల్లోలం చేస్తూనే ఉన్నాయి. ఊహించని స్థాయిలో వానలు, వరదలు ముంచుకొచ్చి పెద్ద సంఖ్యలో ప్రజలను కబళిస్తూనే ఉన్నాయి. ఇటీవల కేరళలోని వయనాడ్ జిల్లాలో భారీస్థాయిలో ముంచుకొచ్చిన వరదలు పెను భీభత్సాన్ని సృష్టించాయి. ఊళ్లమీద పెద్దపెద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. శవాలు కుప్పలుపడ్డాయి. దాదాపు 365 మందికిపైగానే జనం కొండరాళ్ళ కింద పడి, వరద బురదలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఇంకా కొన్ని వేలమంది గాయాలతో విలవిల్లాడుతున్నారు. ఆ దయనీయ దృశ్యాలు చూపరులను కంటితడిపెట్టిస్తున్నాయి. వరదల భీభత్సానికి ఎక్కడ ఎవరు మృత్యురాకాసికి బలైపోయారో నేటికీ స్పష్టంగా తేలడం లేదు. ఇంకా గల్లంతైన వందలాది మంది జాడ తెలియాల్సి ఉంది. ఒక్క కేరళనే కాదు, పశ్చిమ కనుమల పరిధిలో ఉన్న పలు రాష్ట్రాలను ఇలాంటి ప్రకృతి భీభత్సాలు అప్పుడప్పుడూ గజగజ వణికిస్తూనే ఉన్నాయి. ఎంతోమంది ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి. కేరళలో వరదలు, కొండచరియలు ప్రజల్ని బెంబేలెత్తిస్తుంటే, మరోవైపు దేశంలోని పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో గత రెండు వారాలుగా ఆగకుండా కురుస్తున్న కుంభవృష్టితో అనేక ప్రాంతాలు మునిగిపోయి, ఎంతోమంది ప్రజలు గల్లంతైపోయారు. ఆధ్యాత్మికంగా కూడా ప్రసిద్ధి చెందిన ఆ రాష్ట్రాలను వరదలు ముంచెత్తుతున్నాయి. దేవభూములుగా ఉన్న అనేకప్రాంతాలు మరుభూములుగా మిగిలిపోతున్నాయి. జమ్ముకశ్మీర్‌లో ఇటీవల కురిసిన కుండపోత వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. ఎంతో పుణ్యప్రదమైన అమర్‌నాథ్ యాత్ర కూడా ఆగిపోయింది. గౌరీకుండ్, భీమ్‌బలి, కేదార్‌నాథ్‌లలో ఈనెల 4న వచ్చిన వానలు వరదల బారినుంచి సహాయక దళాలు కనీసం 10వేల మందికిపైగా ప్రజలను కాపాడినట్లు సమాచారం. మహారాష్ట్రలో భారీవర్షాలు జనాన్ని భీతావహుల్ని చేస్తున్నాయి. పుణే వద్ద ఉన్న జలాశయం గేట్లు తెరచి నీటిని వదలడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. థానే, ముంబై, రాయ్ ఘడ్, నాసిక్ తదితర ప్రాంతాలన్నీ ఈ జలవిలయంతో భయాందోళనతో ఉన్నాయి. ఝార్ఖండ్‌లో వానల ధాటికి నదులు పొంగిపొర్లుతున్నాయి. అల్పపీడనం కారణంగా మధ్యప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్‌లలోనూ భారీవర్ష సూచనలతోనే జనం భయపడే స్థితి వచ్చేసింది. ఉత్తరాది రాష్ట్రాల్లో వానలు విలయం సృష్టిస్తుండడంతో అటు ప్రజలు, పెద్దసంఖ్యలో యాత్రికులు ప్రాణభయంతో అల్లాడిపోతున్నారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ మీదుగా కేదార్‌నాథ్ వెళ్లే మార్గం వానల ధాటికి ధ్వంసమైపోయింది. కొండచరియలు విరిగిపడి అన్ని మార్గాలు మూసుకుపోయి ఆ ప్రాంతాలన్నీ అల్లకల్లోలంగా ఉన్నాయి. ఇప్పటికే 11 మందికి పైగా చనిపోయారని, వందలాదిమంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారని సమాచారం. హిమాచల్‌ప్రదేశ్‌లోని మూడు జిల్లాలో ఈ భారీవానలకు 8 మంది చనిపోయారు. మరో 45మంది గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపులు జరుగుతున్నాయి. అంతేకాదు, తాజాగా రాజధాని ఢిల్లీని కూడా వానలు వదలకుండా వణికిస్తున్నాయి. దేశంలోని ఆరు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో విరుచుకుపడుతున్న ఈ విలయాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం వెంటనే పశ్చిమ కనుమల్లో మైనింగ్‌ను బంద్‌చేస్తూ నిర్ణయం తీసుకుంది. కర్నాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో ఆ పరిధిలో ఉన్న ప్రాంతాలలో ఎక్కడా పర్యావరణ విధ్వంసాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తూ నిర్ణయాలు తీసుకోవడం సంతోషకరం. ఆ 6 రాష్ట్రాల్లోని దాదాపు 56,800 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలు పర్యావరణానికి అత్యంత సున్నితమైనవిగా పేర్కొంటూ, అక్కడ మైనింగ్‌తో పాటు క్వారీయింగ్‌ను, ఇసుక తవ్వకాలను నిషేధించి, ఆమేరకు 5వ ముసాయిదా నోటిఫికేషన్‌ను కూడా కేంద్రం విడుదల చేసింది. ఏదేమైనా, దేశంలో గుజరాత్ నుంచి మహారాష్ట్ర, కర్నాటక, గోవా, కేరళ, తమిళనాడులోని కన్యాకుమారి దాకా విస్తరించి ఉన్న పశ్చిమకనుమల్లో ఎంతోకాలంగా మనిషి చేస్తున్న విధ్వంసాలు ప్రకృతిని వికృతిగా మారుస్తున్నాయని చెప్పక తప్పదు. ప్రగతి పేరుతో పర్వత ప్రాంతాలు నాశనమైపోతున్నాయి. విస్తారమైన అడవులను ఇష్టంవచ్చినట్లు నరికేస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం వంటివి కూడా ఈ భయంకరమైన విపత్తులకు కారణమవుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆవేదన చెందుతున్నారు. మానవ తప్పిదాల వల్ల ముంచుకొస్తున్న ఈ ముప్పులను, మరణమృదంగాలను ఎవరాపగలరు?..ఇకనైనా కేంద్రంతో పాటు ఆయా రాష్ట్రాలు ఖచ్చితమైన పర్యావరణ పరిరక్షక విధానాలను చిత్తశుద్ధితో అవలంభించి, ప్రకృతిని కాపాడుకోవడమొక్కటే మార్గం!...

# జగన్‌పై విమర్శలు మాని.. బాబు ప్రతిభ చూపాలి!

గత వారం మన 'లాయర్'లో బాబు శ్వేతపత్రాలపై మంచి విశ్లేషణ ఇచ్చారు. నిజమే.. మీరు చెప్పినట్లుగా గత ప్రభుత్వ పాలకులు అసమర్థులు కాబట్టే కదా ప్రజలు చంద్రబాబు కూటమికి అధికారం కట్టబెట్టింది. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విధ్వంసం గురించి చర్వితచరణంగా చెప్పడం అవసరం లేదు. అవన్నీ ప్రజలకి తెలిసిన విషయాలే. రాష్ట్రాన్ని అభివృద్ధి పట్టాలకి ఎక్కించడానికి కావలసిన అన్ని అవకాశాలు ఇప్పుడు చంద్రబాబుకి ఉన్నాయి. కేంద్రప్రభుత్వం బాబు దయతో నడుస్తోంది. రాష్ట్రంలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగినన్ని సీట్లు బాబుకి ఉన్నాయి. ఇప్పుడు ఆయన ఎవరి నామ స్మరణా చేయవలసిన అవసరం లేదు. కేవలం అభివృద్ధి మంత్రం జపిస్తే చాలు. చంద్రబాబు నలభై అయిదేళ్ల రాజకీయ చతురత, గతంలో మూడుసార్లు సీఎంగా పనిచేసిన అనుభవం అన్నీ కలిపి దగాపడ్డ ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన పాటుపడాలి. అప్పుడే జనం బాబుపై పెట్టుకున్న నమ్మకానికి సార్ధకత చేకూరుతుంది!

**జీ.వీ.సుబ్బయ్య, పిడుగురాళ్ల.**

# పర్యావరణంపై చైతన్యం రావాలి!

పర్యావరణ పరిరక్షణపై దేశంలో విస్తృత చర్చలు జరగాలి. భవిష్యత్తులో రానున్న విపత్తుపై రేపటి తరాన్ని జాగృతం చేయాలి. ఈ బాధ్యత ప్రభుత్వాలతో పాటు సామాజిక సేవాసంస్థలు, పలు రంగాలలో ప్రాముఖ్యతని సంతరించుకున్న బాధ్యతాయుత వ్యక్తులు తమ భుజస్కందాలపైకి ఎత్తుకోవాలి. ముఖ్యంగా యువతను ప్రభావితం చేయగలిగిన క్రీడా, సినీ రంగాల ప్రముఖులు ఈ బృహత్ కార్యక్రమానికి నడుం బిగించాలి. "అమ్మ పేరుతో ఒక్క మొక్క" అని మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన హరిత విప్లవానికి మనమంతా మద్దతు పలకాలి. మనకి జన్మనిచ్చిన తల్లి పేరుతో ఒక మొక్కని నాటి, అది మహావృక్షమయ్యేలా దాని సంరక్షణ బాధ్యత మనమే తీసుకోవాలి. పలురకాల కాలుష్యంతో కలుషితమవుతున్న పర్యావరణాన్ని పచ్చని చెట్లు మాత్రమే రక్షించగలవన్న నినాదంతో సమాజంలో చైతన్యం తేవాలి. "ఇది మనదేశం–ఇది మన బాధ్యత" అన్నట్లుగా ప్రతి భారతీయుడు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిన పూనాలి!

**ప్రొ. విశ్వేశ్వరరావు, హైదరాబాదు.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# అలాంటి వారిని ఉరి తీయాలి!

కాసులకి కక్కుర్తిపడి పాఠశాలల్లో నాసిరకం నిర్మాణాలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లని సంఘ బహిష్కరణ చేయాలి. అలాగే ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తూ ఇలాంటి కాంట్రాక్టర్ల అడుగులకి మడుగులు వత్తుతున్న అధికారులను కూడా వదిలిపెట్ట కూడదు. చిన్నారుల ప్రాణాలు బలితీసుకుని వారి తల్లితండ్రులను కడుపు కోతకి గురి చేస్తున్న ఇలాంటి వారిని ఉరి తీసినా తప్పు లేదు. అక్రమ సంపాదనకి అలవాటుపడి, రోడ్లు, వంతెనలు నిర్మించినట్లుగా పాఠశాలల పనులని కూడా నాణ్యత లేకుండా నిర్మించడం నీచమైనచర్య. తాజాగా నెల్లూరు కే.ఎన్.ఆర్ పురపాలక పాఠశాలలో జరిగిన సంఘటన మళ్ళీ పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి!

**ఆర్.లక్ష్మీరాజ్యం, భక్తవత్సలనగర్.**

## సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 50

# అంతర్జాల మాయలో పసి ప్రాయం!

తమ బిడ్డలు అన్నం తినకుండా మారాం చేస్తూ ఏడుస్తుంటే..

"చందమామ రావే... జాబిల్లి రావే, కొండెక్కి రావే... గోగుపూలు తేవే.. మా బుజ్జి పాపాయికి బువ్వ తినిపించవే" అంటూ బిడ్డని చంకలో ఎత్తుకుని మురిపెంగా అమ్మలు వినిపించే అన్నమయ్య కీర్తన ఆ పసిబిడ్డలకి లాలన.

రాత్రి వేళల్లో చిన్నారులు నిద్రపోకుండా మొండికేస్తుంటే...

"అనగనగా ఒక రాజు - ఆ రాజుకి ఏడుగురు కొడుకులు, ఆ ఏడుగురు వేటకెళ్లి ఏడు చేపలు తెచ్చారు" అంటూ నానమ్మలూ, అమ్మమ్మలూ చెప్పే కథలూ, వీపు మీద చిచ్చికొడుతూ "జో లాలీ" అంటూ ఆ చిన్నారులకి వాళ్ళు వినిపించే జోలపాటలు... ఆ పాపాయిలకి ఊరట.

ఇది ఒకప్పటి మాట.

ఇప్పుడు కాలం మారింది. అమ్మానాన్నల తీరు మారింది. పసి హృదయాల దృష్టి మారింది. ఆధునిక పరిజ్ఞానం కుటుంబాల్లో కొలువు తీరింది.

సెల్‌ఫోన్ అనే మాయలమారికి, అంతర్జాలం అనే మహమ్మారి తోడై, కుటుంబవ్యవస్థ నాశనానికి నాంది పలికింది.

ఇప్పుడు "చందమామ రావే" అని పాడే అమ్మలు లేరు. "ఒక రాజు ఏడుగురు కొడుకుల కథ" చెప్పే నానమ్మలు, అమ్మమ్మలు అసలే లేరు.

అంతా హైటెక్.

పిల్లలు ఏడిస్తే ఐ పాడ్, టీవీ, సెల్‌ఫోన్ లేదా ట్యాబ్... ఈ నాలుగు సాధనాలలో ఏదో ఒకటి నేటి పసివాళ్ళ చేత అన్నం తినిపించాలి. వాళ్లకు నిద్ర రాకపోతే నిద్ర పుచ్చాలి. వారి అలక తీర్చి ఏడుపు మాన్పించాలి.

ఆ నాలుగింటిదే ఆ భారమంతా.

రెండేళ్లు కూడా నిండని పిల్లల చేతికి సెల్‌ఫోన్ ఇచ్చేస్తున్నారు. వాళ్ళ పాటికి వాళ్ళు ఇష్టమొచ్చినట్లుగా వేళ్లతో కలిబెట్టుకుంటూ తమని ఆకర్షించిన కార్యక్రమాల దగ్గర ఆగిపోతున్నారు. అమ్మలు, నాన్నలు కూడా తమ బిడ్డల పక్కనే చెరో సెల్‌ఫోన్ పట్టుకుని వాట్సాప్‌లలో, ఇన్‌స్టాగ్రామ్‌లలో, ఫేస్ బుక్కులో, ట్విట్టర్‌లో లేదా చాటింగులలో యమ బిజీ అయిపోతున్నారు.

నేటి ఆధునిక ప్రపంచానికి తగినట్లుగా వందలాది ఛానళ్ళు యుట్యూబ్‌లో అందుబాటులో ఉన్నాయి.

ముఖ్యంగా అభం శుభం తెలియని పసిబిడ్డల భవిష్యత్తుని బుగ్గిచేసే అత్యధిక కార్యక్రమాలకి రూపకల్పన చేయడంలో చైనా ఆరితేరిపోయింది. పిల్లలలో ఆహ్లాదాన్ని కలిగించే అనేక కార్యక్రమాలని ఆ దేశం తయారు చేసి అంతర్జాలంలో ఉంచుతోంది. ఇన్ఫోబెల్స్(Infobells), చూచు టీవీ(Chuchu Tv), బీబీఫిన్ (Bebefinn), బౌన్స్ పేట్రోల్ (Bounce Patrol) వంటి ఛానల్స్‌తో పాటు ప్రపంచంలోనే ఎక్కువమంది వీక్షిస్తున్న ఛానల్‌గా ప్రసిద్ధిచెందిన పింక్ఫాంగ్ (Pinkfong) ఇప్పుడు అంతర్జాలంలో రాజ్యమేలుతూ ప్రపంచవ్యాప్తంగా చిన్నారుల జీవితాలలో ఒక భాగమైపోయాయంటే అతిశయోక్తికాదు. వీటిల్లో కొన్ని భారతీయ ఛానళ్ళతో పాటు ఇతర దేశాలవి కూడా ఉన్నాయి. కేవలం ఇవే కాదు ఇలాంటివి వందలకొద్దీ ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

## నాటికీ నేటికీ పూర్తిగా భిన్నంగా....

పాత రోజులతో పోలిస్తే నేటి పరిస్థితులు అందుకు పూర్తిగా భిన్నంగా తయారయ్యాయి. గతంలో పిల్లలు స్కూలు నుండి రాగానే కొంచెం ఫలహారం తీసుకుని, ఆ తరువాత అలా బయటకి వెళ్లి కాసేపు ఆడుకుని, ఇంటికొచ్చి స్నానం చేసి పుస్తకాలు ముందేసుకుని హోంవర్కు చేసుకుని అలసిపోయి నిద్రపోయేవారు. ఒకప్పుడు అమ్మ లేదా నాన్న తమ బిడ్డని స్కూలు నుండి ఇంటికి తీసుకొచ్చేటప్పుడే ఇద్దరి మధ్యా సంభాషణ జరిగేది. ఇవ్వాళ స్కూలు విశేషాలు ఏమిటి అని వాళ్ళు అడిగేవాళ్ళు. ఇవ్వాళ క్లాసులో ఏం నేర్చుకున్నావు అని అడిగి తెలుసుకునేవారు.

నేటి పరిస్థితి అది కాదు...

పిల్లవాడిని బడి నుండి ఇంటికి తీసుకొచ్చేటప్పుడే వాడి చేతికి సెల్‌ఫోన్ ఇచ్చేస్తున్నారు. నాన్న బండి తోలుతుంటే వాడు వెనక కూర్చుని ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటుంటాడు. ఇంటికెళ్ళాక కూడా వాడి ధోరణి వాడిది, వీళ్ళ ధోరణి వీళ్లది. తమని డిస్ట్రబ్ చేయకుండా వాళ్ళేమి చేసుకున్నా పరవాలేదన్న విధంగా అమ్మా నాన్నలు వ్యవహరిస్తున్నారు.

ఈ పరిణామాలు పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. కృత్రిమ ఆనందం పట్ల వాళ్ళు ఆకర్షితులవుతున్నారు. వారిలో సహజ సిద్ధంగా వుండే "డోపామైన్" (Dopamine) అనే హార్మోన్లు వారిలో తాత్కాలిక ఆహ్లాదాన్ని కలిగించి వారిని ఉత్సాహపరుస్తున్నాయి. చిరుప్రాయం నుండే వాళ్ళు ఇలా అలవాటుపడిపోవడంతో సహజసిద్ధంగా వచ్చే ఆనందాన్ని వాళ్ళు అనుభవించలేకపోతున్నారని మానసిక నిపుణులు చెప్తున్నారు. వాళ్ళు చూస్తున్న కార్యక్రమాలు వారిని ఉత్తేజపరచడంతో సహజసిద్ధంగా స్పందించవలసిన "డోపామైన్ హార్మోన్లు" యాంత్రికంగా స్పందించి తాత్కాలిక సంతోషాన్ని వారికి కలిగిస్తాయని చెప్తున్నారు. అలా అలవాటుపడిపోయిన వారు సత్వర సంతోషం కోసమే వెతుక్కుంటారని సైకాలజీ నిపుణులు అంటున్నారు.

ఇలాగే కొనసాగితే తాత్కాలిక మానసిక ఆనందం కోసం వాళ్ళు ఏ పని చేయడానికైనా సిద్ధపడేలా తయారవుతారని కూడా వారంటున్నారు. ఇలాంటి పరిస్థితులను ఇప్పటినుండే కట్టడిచేయకపోతే బాలల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని చెప్తున్నారు. ఇప్పటికే అనేక నేర సంఘటనలలో బాలల పాత్ర ఉంటుందని, వాళ్ళు చిన్నప్పటినుండి చూస్తున్న ఛానళ్ల ప్రభావమే వారిని అలా తయారుచేస్తోందని కూడా ఆందోళన చెందుతున్నారు.

జీవన పోరాటంలో క్షణం తీరిక లేకుండా పరుగులు తీసే నేటి తరం అమ్మా నాన్నలు రేపటి తరానికి వారసులైన తమ బిడ్డల భవిష్యత్తుపై దృష్టిపెట్టాలి. తమకి తెలియకుండానే తమ బిడ్డలని ఎలాంటి ఊబిలో దించుతున్నామో ఆలోచించుకోవాలి. రోజులో కొంత సమయాన్ని తమ చిన్నారుల కోసం కేటాయించాలి. ఇతర దేశాలలో వున్నవారు మన సంస్కృతీ సంప్రదాయాలని వారి బిడ్డలకి నేర్పిస్తుంటే, మనం పాశ్చాత్త్య చానళ్లకు మన బిడ్డలని బానిసలని చేసి పెను ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నాం. మన బిడ్డల భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్తుని కూడా ప్రశ్నార్థకంగా మారుస్తున్నాం.

ఈ తరం మారాలి. నవతరం, భావితరం బాగుపడాలంటే సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ఐ ప్యాడ్‌లు, టీవీలని తమ పిల్లలకి దూరం చేయాలి. అంతర్జాల మాయలో ఉన్న పసిప్రాయాన్ని ఆ ఊబిలో నుండి బయటకి తేవాలి!

**- రాజశ్రీ**

# రండి..! శ్రీసిటీని సందర్శించండి

## - సీఎం చంద్రబాబుకు డా. రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానం




శ్రీసిటీని సందర్శించాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. రవీంద్ర సన్నారెడ్డి తన రెండు రోజుల అమరావతి పర్యటనలో భాగంగా, ఈనెల 3న సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి, శ్రీసిటీ ప్రగతిని సీఎంకు వివరించారు. ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తులో అభివృద్ధి కార్యాచరణ, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగ ఉపాధి అవకాశాల సృష్టి తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పరిశ్రమల ఉత్పత్తులతో కూడిన 'మేడ్ ఇన్ శ్రీసిటీ' జ్ఞాపికను ముఖ్యమంత్రికి బహూకరించారు. శ్రీసిటీని సందర్శించి పారిశ్రామిక ప్రగతిని వీక్షించాలని సీఎంను ఆహ్వానించారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు.

అదేవిధంగా, డీజీపీ ద్వారకా తిరుమలరావుని కలిసిన రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రాంతంలో శాంతి భద్రతల పరిస్థితులు మరియు కొత్తగా మంజూరైన శ్రీసిటీ అధునాతన పోలీస్‌స్టేషన్ నిర్మాణ భూమిపూజ అంశాలను ఆయనతో చర్చించారు. విదేశీ ప్రతినిధులు, పెద్దసంఖ్యలో మహిళా కార్మికులు, విద్యార్థులు వున్న శ్రీసిటీ ప్రాంతాన్ని సురక్షితంగా వుంచుతూ శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్న పోలీస్‌శాఖను ప్రశంసిస్తూ, డీజీపీకి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన కృతజ్ఞతలు తెలిపారు.

### పలువురు మంత్రులతో భేటీ

శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఇటీవల అమరావతిలో పలువురు మంత్రులను మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో సమావేశమై పలు అంశాలను చర్చించారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్‌తో పాటు గతంలో తనతో, శ్రీసిటీతోను సాన్నిహిత్యం ఉన్న పట్టాభివృద్ధి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిలను కలిసి శ్రీసిటీ ప్రగతి ప్రస్థానాన్ని వివరించారు. ప్రస్తుతం చేపట్టనున్న వివిధ పారిశ్రామిక ప్రగతి ప్రణాళికలను వారికి వివరించారు. శ్రీసిటీని సందర్శించి ఆ పురోగతిని ప్రత్యక్షంగా చూడాలని ఆయన మంత్రులను ఆహ్వానించారు. ఆయన ఆహ్వానం పట్ల మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ఆయన సంతోషం వ్యక్తం చేశారు.





# పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సభ్యుడిగా విపిఆర్



పార్లమెంట్ పరిధిలోని పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ(సీఓపియు) సభ్యుడిగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఇటీవల ఎన్నికయ్యారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు ప్రభాకర్ రెడ్డి కమిటీ సభ్యుడిగా సేవలు అందించనున్నారని లోక్‌సభ స్పీకర్ ప్రకటించారు. కమిటీ ఆన్ పబ్లిక్ అండర్ టేకింగ్ అనేది భారత పార్లమెంట్‌లోని మూడు ఆర్థిక స్టాండింగ్ కమిటీలలో ఒకటి. ఇది ప్రభుత్వ రంగ సంస్థల నివేదికలు మరియు ఖాతాలను పరిశీలించే ఉద్దేశ్యంతో ఎంపిక చేయబడిన కమిటీ. ఈ కమిటీకి విపిఆర్ సభ్యునిగా ఎంపికవడంతో పలువురు ఎంపీలు, నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

### టీడీపీ నేతల సంబరాలు...



పబ్లిక్ అండర్ టేకింగ్స్ పార్లమెంటరీ కమిటీ సభ్యులుగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకొని నెల్లూరులోని విపిఆర్ నివాసంలో తెలుగుదేశం నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వేమిరెడ్డి కోటారెడ్డి, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా.. మంత్రి నారాయణ



**• 13 మందికి రూ.6 లక్షలు అందజేత**



కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తమ పార్టీ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. కార్యకర్తల కోసం తన కుటుంబసభ్యులతో కలిసి సంవత్సరానికి పది కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం చేసేలా నిర్ణయించుకుని, ఆ మేరకు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి అండగా నిలుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 4న ఒక్కరోజే 13మంది కార్యకర్తలకు 6 లక్షల రూపాయల నిధులను తమ పార్టీ నాయకుల ద్వారా పంపి, వారికి అండగా నిలిచారు. నగరంలోని 4వ డివిజన్‌కు చెందిన విజయలక్ష్మి, నవీన్, మన్సూర్, 7వ డివిజన్‌కు చెందిన సులోచన, 9వ డివిజన్‌కు చెందిన మోహన్, మాధవ్, 13వ డివిజన్‌కు చెందిన జాన్, 15వ డివిజన్‌కు చెందిన మురళీ, 44వ డివిజన్‌కు చెందిన రియాజ్‌అహ్మద్, 48వ డివిజన్‌కు చెందిన సమీన, హుస్సేన్, శ్రీనివాసులు, 53వ డివిజన్‌కు చెందిన అమ్మణ్ణమ్మల కుటుంబాలకు వారి అవసరాలను బట్టి ఆర్థిక సహాయ చెక్కులను డివిజన్ ఇన్‌చార్జ్‌ల చేతుల మీదుగా అందజేయించారు. దీంతో వారు తమ సంతోషాన్ని వ్యక్తంచేస్తూ మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రతి ఇంటిపై..మువ్వన్నెల పతాక ఎగరాలి

'ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 13వ తేదీ వరకు జిల్లాలో 'హర్‌ఘర్ తిరంగా' కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో, ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఎగ్జిబిషన్, ర్యాలీలు, విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, చర్చా వేదికలు, పోస్టర్ మేకింగ్ వగైరాలను నిర్వహించారు. ఈనెల 9న సాంస్కృతిక కార్యక్రమాలు, 10న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వీవీ గిరి జయంతి నిర్వహించి, అదేరోజు సాయంత్రం హారతులు ఇచ్చే కార్యక్రమం చేపట్టాలన్నారు. 11వ తేదీన వారసత్వ నడకలు, 12న క్రీడా పోటీలు, 13న జాతీయ పతాకంతో సెల్ఫీలు దిగడం వంటి దేశసమగ్రత, జాతీయభావం పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తామని, ప్రజలంతా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

# స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీగా.. శ్రీనివాసరావు



నెల్లూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీగా అత్తిన శ్రీనివాసరావు ఈనెల 5న జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. 1991లో పోలీసుశాఖలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయన, ఆ తర్వాత రాజమండ్రి, బాపట్ల, నంద్యాల జిల్లా ఆత్మకూరుల్లో డీఎస్పీగా పనిచేశారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో ఆయన నెల్లూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీగా నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించడంతో, స్పెషల్‌బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్లు నాగేశ్వరమ్మ, జానీ, ఎస్ఐ సుబ్బారావు, సైబర్‌క్రైమ్స్ ఎస్ఐ సురేష్, స్పెషల్‌బ్రాంచ్ పోలీసు సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ సౌజన్యను గౌరవపూర్వకంగా కలిశారు.

## ఓబీసీ సంక్షేమ కమిటీ సభ్యునిగా.. బీఎంఆర్



ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీలు) సంక్షేమ పార్లమెంటు కమిటీకి ఇటీవల జరిగిన ఎన్నికలలో నెల్లూరుజిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు (బీఎంఆర్) ఎన్నికయ్యారు. రాజ్యసభ పార్లమెంటరీ విభాగం ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఆ కమిటీలో బీఎంఆర్‌కు ఏడాదిపాటు సభ్యత్వం ఉంటుంది. ఆయనతోపాటు మరో 9 మంది పార్లమెంటు సభ్యులు కూడా ఈ కమిటీకి ఎంపికయ్యారు. పార్లమెంటరీ ఓబీసీ సంక్షేమ కమిటీకి ఎంపికైనందుకు వైకాపా అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైకాపా రాజ్యసభ ఫ్లోర్‌లీడర్ విజయసాయిరెడ్డికి, వైకాపా పార్లమెంటరీ పార్టీ నాయకులు వైవి సుబ్బారెడ్డికి బీఎంఆర్ ధన్యవాదాలు తెలిపారు.




## వ్యాధులపై పోరాడేందుకు..
# సరికొత్త ఆవిష్కరణలు రావాలి
### - పల్మనాలజిస్ట్‌ల సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి



వ్యాధులపై పోరాడేందుకు, వాటిని నిరోధించేందుకు సరికొత్త ఆవిష్కరణలు, అధునాతన నూతన సాంకేతికత ఎంతైనా అవసరమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రోగులను కాపాడేందుకు కృషిచేయాలని ఆయన ఆకాంక్షించారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్స్ ఆఫ్ సీమాంధ్ర 5వ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఊపిరితిత్తుల ఆరోగ్యం, దాని సంబంధిత వ్యాధులు మరియు వాటికి చికిత్స చేయడానికి, కొత్త టెక్నాలజీపై ప్రజలను అవగాహన కల్పించడానికి ఈ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన పల్మనాలజిస్ట్‌ల సావనీర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ పిట్టి మల్లికార్జున, ఆర్గనైజింగ్ ఛైర్మెన్ డాక్టర్ గౌరీనాథ్, కోశాధికారి డాక్టర లక్ష్మీసుస్మిత, వివిధ జిల్లాల డాక్టర్లు పాల్గొన్నారు.

## కొత్త చట్టాలపై న్యాయవాదులకు అవగాహన



కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త చట్టాలపై నెల్లూరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.భరద్వాజ్ న్యాయవాదులకు అవగాహన కలిగించారు. నెల్లూరు బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జులై 1 నుంచి 3 కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. గతంలో సివిల్ ప్రొసీజర్ కోడ్ 1973, భారతీయ శిక్షాస్మృతి 1869, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872 ఐపీసీ సెక్షన్లుగా ఉన్నాయని, ఇప్పుడు అవి భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలుగా అమలులోకి వచ్చాయని వివరించారు. ప్రత్యేక రైల్వేకోర్టు న్యాయమూర్తి పి. వినోద్ మాట్లాడుతూ, ఈ 3 నూతన క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ పాల్గొన్నారు.

## హాస్టళ్ల సమస్యలపై ధర్నాందోళన

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీఎస్టీ బీసీ హాస్టళ్లలో ఉన్న సమస్యలు తీర్చాలంటూ అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నెల్లూరుజిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 6న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నాందోళన చేపట్టారు. హాస్టళ్లలో కనీస వసతులను మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, వంటవారి పోస్టులను భర్తీ చేయాలని, పెరుగుతున్న ధరల కనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డైట్, కాస్మొటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని తదితర డిమాండ్లతో వారు డిఆర్ఓ లవన్నకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, నాయకులు శివం, ప్రసాద్, అబ్దుల్, అక్షయ్, వెంకటేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## మంచి నిర్ణయాలతోనే భావితరాలకు మేలు
### కలెక్టర్లతో సీఎం చంద్రబాబు



మనం తీసుకునే నిర్ణయాల వల్ల వ్యవస్థలే మారే పరిస్థితి ఉంటుందని, మంచి నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మనమంతా కష్టపడితే 2047 నాటికి ప్రపంచంలోనే మనం నంబర్ వన్‌గా ఉంటామని, ఆ దిశగా కలెక్టర్లు జిల్లాల్లో ప్రధాన పాత్ర పోషించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నెల 5న వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, జిల్లాలోని రామాయపట్నం పోర్టు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను భూసేకరణ, పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేందుకు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ఈ కాన్ఫరెన్సుకు నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలు నుంచి ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ, డీటీసీ చందర్, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డ్వామా పీడీ శ్రీనివాసులు, డిఎంఅండ్‌హెచ్ఓ పెంచలయ్య, పశుసంవర్ధకశాఖ జేడీ కోటేశ్వరరావు, డీసీఓ గుర్రప్ప, డీఇఓ రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో 'రేలా మెడికల్ సెంటర్'
### ప్రారంభోత్సవం చేసిన ఆచార్య సీఎంకే రెడ్డి




చెన్నైలో ప్రముఖమైన రేలా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఇకనుంచి నెల్లూరు జిల్లా ప్రజలకు కూడా అధునాతనమైన విశిష్ట వైద్యసేవలందనున్నాయి. ఆ ఆసుపత్రి మెడికల్ సెంటర్‌ను నెల్లూరులోని పొగతోట గాంధీనగర్‌లో ఇటీవల ప్రారంభించారు. రేలా ఆసుపత్రి ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మొహ్మద్ రేలా సమక్షంలో ప్రముఖ వైద్యులు, తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ప్రసిద్ధ వాస్కులర్ సర్జన్ ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి దీనికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటివరకు ఈ ఆసుపత్రి ద్వారా చెన్నైలో సుమారు 3వేల కాలేయమార్పిడి చికిత్సలను విజయవంతంగా చేశామన్నారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో 2 నెలల చిన్నారి జ్ఞానసాయికి కూడా కాలేయమార్పిడి చికిత్సను జయప్రదంగా చేశామని, ఇప్పుడు ఆ బాలికకు ఎనిమిదేళ్ళ వయసు వచ్చిందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ఆ చిన్నారి కూడా పాల్గొనడం విశేషం. బాధితులకు ఈ మెడికల్ సెంటర్‌లో స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, అవసరమైతే చెన్నైలోని ప్రధాన ఆసుపత్రిలో చికిత్సలు చేయడం జరుగుతుందని ఛైర్మెన్ చెప్పారు. డాక్టర్ సి.రామ్‌కిరణ్‌రెడ్డి, రేలా గ్రూప్‌లోని పలువురు వైద్యనిపుణులు పాల్గొన్నారు.



## 'ఇస్కాన్' సేవలు అద్భుతం

నెల్లూరులో ఇస్కాన్ మందిరం వారి ఆధ్యాత్మిక, సామాజిక సేవలు అద్భుతమని నెల్లూరు ఎంపీ, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) కొనియాడారు. ఆగస్టు 26 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి సమాయత్తమవుతున్న ఇస్కాన్ మందిరాన్ని ఆయన ఈనెల 4న సందర్శించి, మందిరం అధ్యక్షులు శుకదేవస్వామి, రాజశేఖర్‌దాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఇస్కాన్ సంస్థ జిల్లాలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో శ్రీకృష్ణుడి బోధనలను ప్రచారం చేస్తోందని, శ్రీకృష్ణజన్మాష్టమి, జగన్నాథ రథయాత్ర తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరంలో ఫ్యాన్సీడ్రెస్, డ్రాయింగ్, శ్లోకాల పఠనం, సంగీత పోటీల్లో పెద్దసంఖ్యలో పాల్గొన్న చిన్నారులను చూస్తే ముచ్చటేస్తుందన్నారు. ఆ పోటీలను ఆయన ప్రారంభించి, పోటీల్లో పాల్గొంటున్నవారందరినీ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, సత్యభామ, రాధ, గోపికల వేషధారణలతో ఉన్న చిన్నారులను ఎత్తుకుని ఆయన వారితో సరదాగా ఫోటో దిగడంతో ఆ చిన్నారుల తల్లితండ్రులు ఎంతగానో సంతోషించారు. తొలుత, వేమిరెడ్డిని మందిరం నిర్వాహకులు ఘనంగా స్వాగతించారు.

## శ్రీ రాజరాజేశ్వరి దేవాలయంలో..
# శ్రావణమాసం వేడుకలు



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 5వ తేదీ నుంచి శ్రావణమాసం వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 2వతేదీ వరకు ఈ వేడుకలు జరుగుతాయి. అందుకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో ఇటీవల దేవస్థాన సహాయ కమిషనర్, వెంకటసుబ్బయ్య, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అర్చకులు ఆవిష్కరించారు. ఈ శ్రావణమాసంలో నాలుగు శుక్రవారాల్లో అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు, నాలుగు మంగళవారాల్లో కాత్యాయని వ్రతాలు నిర్వహిస్తామని, రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఉంటుందని వారు వెల్లడించారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రత్నం జయరామ్ కోరారు.

## సెప్టెంబర్ 1 నుండి పశుగణన

సెప్టెంబర్ 1 నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు జిల్లాలో 21వ అఖిలభారత పశుగణన - 2024 కార్యక్రమం జరుగుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వి.కోటేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి పశుపక్షాదుల వివరాలు సేకరించి నమోదు చేయాలని సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సూచించారు.






## రక్తదాతకు అభినందన



ఒకటి, రెండు సార్లు కాదు..73 సార్లు రక్తదానం చేసిన ఆ రక్తదాతను అందరూ అభినందిస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంత అధ్యాపకులైన ఐవిఎస్ఆర్ శర్మ ఇప్పటిదాకా అన్నిసార్లు రక్తదానం చేసినందుకు ఈనెల 6న స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో ఆయన్ను సన్మానించారు. ఈనెల 6న సూళ్ళూరుపేట శిశు సంక్షేమ ఆసుపత్రిలో ఓ అత్యవసర కేసు కోసం రక్తదానం చేసి సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ) అందజేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

## దేహ సమర్పణ



నెల్లూరుజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కోవూరు శాఖ ప్రధాన అధికారిగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన అవనిగడ్డ వెంకట కృష్ణన్(వెంకటకృష్ణమూర్తి) 82 ఏళ్ళ వృద్ధాప్యంతో ఈనెల 2న మృతిచెందారు. ఆయన కోరిక మేరకు కుటుంబసభ్యులు ఆయన దేహాన్ని స్థానిక పినాకిని దేహ సమర్పణ సంస్థ ఆధ్వర్యంలో నారాయణ వైద్యకళాశాలకు అందజేశారు. తొలుత మోడరన్ నేత్రవైద్యశాల సాంకేతిక నిపుణులు ఆయన నేత్రాలను సేకరించారు. అవనిగడ్డ కృష్ణమూర్తి సాహిత్యాభిలాషులు. ఇంట్లో ఒక పెద్ద గ్రంథాలయం కూడా ఏర్పాటుచేసుకుని విశ్రాంత రోజుల్లో పుస్తక పఠనంలో నిమగ్నులై ఉండేవారు. మరణించాక కూడా తన దేహం పదుగురికీ ఉపయోగపడాలనే ఆకాంక్షతో ఆయన దేహసమర్పణ చేసి తన జీవితాన్ని ధన్యం చేసుకున్నారు. స్థానిక పినాకిని దేహ సమర్పణ సంస్థ ద్వారా ఇది 36వ దేహసమర్పణ అని ఆ సంస్థ ఆర్గనైజర్ తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.



# పెద్దాయనా క్షమించు..!

## బెజవాడ గోపాలరెడ్డిని గాలికొదిలేసిన జిల్లా నాయకులు, అధికారులు!



***భా**రతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి రానున్న ఆగస్టు 15కి 77 సంవత్సరాలు పూర్తి కానున్నాయి. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాటి యోధులను స్మరించుకుంటూ, ఆ మహనీయుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ 'ఆజాదికా అమృత్ మహోత్సవ్' అంటూ గత రెండేళ్ళుగా ప్రతి ఆగస్టు15కి ప్రభుత్వ పెద్దలు హడావుడి చేస్తున్నారు. అందుకోసం దేశవ్యాప్తంగా కోట్లు ఖర్చుపెడుతున్నారు. మంచిదే!. స్ఫూర్తిదాయకమైన అలాంటి కార్యక్రమాలను ఎవరూ కాదనలేరు. కానీ, జిల్లాకు చెందిన గొప్ప నేత, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధునిగా, రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అరుదైన నాయకుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి వంటి నిస్వార్థ సేవామూర్తిని మరచిపోవడం దారుణం. అనేకమంది నాయకుల జయంతులను వర్ధంతులను అట్టహాసంగా జరుపుతున్న అధికారులు, బెజవాడ గోపాలరెడ్డి విషయంలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం శోచనీయం. నెల్లూరు నగరం మినీబైపాస్‌లోని డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి కూడలిలో ఉన్న ఆయన నిలువెత్తు విగ్రహానికి కనీసం ఆయన జయంతి, వర్ధంతుల నాడైనా ఒక్క పూలమాల కూడా వేసి, ఆయనను స్మరించుకోలేకపోవడం సిగ్గుచేటైన విషయం.*

### దేశభక్తి ఆయనకు ప్రాణం :

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డికి దేశభక్తంటే ప్రాణం. జీవించినంతకాలం నైతికవిలువలతో సమాజానికి మార్గదర్శకంగా నిలిచారు. 1907 ఆగస్టు 5న ఆయన నెల్లూరుజిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెంలో జన్మించారు. బుచ్చిలో కళాశాల విద్య అనంతరం బందరు జాతీయ కళాశాలలో చేరి, 1924-27 ప్రాంతాల్లోనే శాంతినికేతన్‌లో రవీంద్ర కవీంద్రుని అంతేవాసి అయ్యారు. అనంతరం, దేశమాత విముక్తి కోసం జాతీయోద్యమంలో చేరి, తెల్లదొరలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. జిల్లాలో స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరిపోశారు. ఫలితంగా ఆరుసార్లు జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చాక, అవిభక్త మద్రాసు రాష్ట్రంలో రాజాజీ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్‌పార్టీలో ఉంటూ, 30 ఏళ్ల వయసు కూడా రాకముందే మంత్రిగా స్థానం పొంది, ప్రజలకు అపారమైన సేవలందించారు. ఆ తర్వాత కర్నూలు రాజధానిగా 1955లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి కూడా గోపాలరెడ్డే. 1956లో విశాలాంధ్ర ఏర్పడి హైదరాబాద్ రాజధాని అయినప్పుడు, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గంలో కేంద్ర రెవెన్యూశాఖ మంత్రిగా కూడా పదవీస్వీకారం చేశారు. ఆ తర్వాత కేంద్ర సమాచార పౌరసంబంధశాఖ మంత్రిగా పదవిలో ఉన్నారు.

అనంతరం, అయిదేళ్ళపాటు ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా కూడా ఉన్నత పదవిని పొంది, తాను ఏ పదవిలో ఉన్నా ప్రజలను, సమాజాన్ని విస్మరించకుండా తనవంతు సేవలందించారాయన.

వసుధైక కుటుంబాన్ని ఆకాంక్షించే మానవతామూర్తి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, ఒక్క నెల్లూరుకు, ఆంధ్ర రాష్ట్రానికి, భారతదేశానికి మాత్రమే చెందినవారు కాదు... విశ్వనరునిగా ఎదిగిన అపురూప వ్యక్తిత్వం గల అరుదైన నాయకుడాయన.

అటు మచ్చలేని రాజకీయవేత్తగా, ఇటు అద్వితీయమైన సాహితీవేత్తగా కూడా రాణిస్తూ, ఏళ్లతరబడిగా తన విశేషమైన కృషితో నెల్లూరుజిల్లాకు గొప్పపేరు తెచ్చిన మహనీయులాయన. మొన్న ఆగస్టు 5వ తేదీన ఆ మహానేత 117వ జయంతి. మన పాలకులు, అధికారులు, చివరికి జిల్లాకాంగ్రెస్ నాయకులు సైతం ఆయనని మరచిపోవడం దుర్మార్గం.

నెల్లూరు నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఆయన విగ్రహం ఉన్నా, ఒక్క నాయకుడు కూడా అటువైపు కన్నెత్తి చూడక పోవడం, కనీసం ఆయనకు పూలమాల వేసి గౌరవించక పోవడం బాధాకరం.

ఓ వైపు ప్రభుత్వ అధికారుల కార్యక్రమాలకి అగ్రతాంబూలం ఇస్తూ, వారి భజనకి ప్రాధాన్యత కల్పిస్తూ, మరోవైపు రాజకీయ నాయకుల అడుగులకి మడుగులొత్తుతున్న సమాచార శాఖ కూడా ఈ సమాచారాన్ని తమ పైఅధికారులకి చేరవేయక పోవడం వారి విధుల పట్ల వారికున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. జిల్లా ప్రతిష్టని దేశవ్యాప్తంగా గుబాళింపజేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రి, కేంద్ర మంత్రి, గవర్నర్ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి జయంతినే పట్టించుకోకుండా గాలికొదిలేసిన ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు.. అమృత మహోత్సవాల పేరుతో ఈ ఉత్తుత్తి ఆర్భాటాలెందుకు చేస్తున్నారో వారికే తెలియాలి.

పెద్దాయనా క్షమించు..!



## దగదర్తి విమానాశ్రయానికి..
# మళ్లీ ఆశల రెక్కలు

### సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో జిల్లా ప్రజల్లో సంతోషం

నెల్లూరుజిల్లాలో దగదర్తి వద్ద విమానాశ్రయం వస్తుందని, జిల్లా నుంచి రయ్‌మంటూ విమానంలో చక్కర్లు కొట్టవచ్చని.. ఈ కల ఇప్పటిది కాదు. ఎంతోకాలం నుంచి ఉంది. అయితే, నాయకులు ఎప్పటికప్పుడు 'అదిగో విమానం..ఇదిగో వచ్చేస్తోంది'.. అంటూ ఊరించడం, ప్రతిపాదనలు.. ప్రయత్నాలు అంటూ హడావిడి చేయడం, ఆ తర్వాత వాటిని అటకెక్కించడం.. ఇన్నేళ్ళుగా ఇదేతంతు! గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి, సీఎంగా చంద్రబాబునాయుడు ఉన్నప్పుడు 2019 జనవరి 6న విమానాశ్రయం నిర్మాణం కోసం దగదర్తిలో శంకుస్థాపన చేశారు. దీంతో, ఇక దగదర్తిలో విమానం ఎగురుతుందని అందరూ ఊహించారు. అందుకు తగ్గట్లుగా అప్పట్లో విమానాశ్రయం నిర్మాణానికి పెద్దఎత్తున ప్రణాళికలు సిద్ధం కావడం, అధికార బృందాలతో స్థలసేకరణలు జరగడం వగైరాలన్నీ జరిగాయి. కానీ ఆతర్వాత వైకాపా ప్రభుత్వం రావడంతో దాని తలరాత కూడా మారిపోయింది. జనం ఆశలన్నీ నీరుగారిపోయాయి. మళ్ళీ ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో దగదర్తికి తప్పకుండా మహర్దశ వస్తుందని, విమానాశ్రయం నిర్మాణం జరిగి తీరుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈనెల 2న రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు గతంలో విమానాశ్రయానికి వేసిన శంకుస్థాపన ఫలకాన్ని, ఆ స్థలాన్ని పరిశీలించడం విశేషం. అంతేకాక, జిల్లా కలెక్టర్, తదితర అధికారులతో చర్చించి, విమానాశ్రయం పనులను మంత్రులిద్దరూ సమీక్షించడంతో, ఆ పనుల్లో మళ్ళీ కదలిక వచ్చింది.

### రాష్ట్రంలో మరికొన్ని విమానాశ్రయాలు :

విమానాశ్రయాలను, ఓడరేవులు, జాతీయరహదారులను అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రంలో వేగవంతంగా అభివృద్ధి సాధ్యమవుతుందని, అందువల్ల విమానాశ్రయాల నిర్మాణాలను కూడా వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావిస్తున్నారు. ఈనెల 6న అమరావతిలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టుల ద్వారా సరుకు రవాణా చేసేలా ప్రాజెక్టులు రూపొందించాలని చెప్పారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపాదించిన విమానాశ్రయాల నిర్మాణాలను, ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దెబ్బతీసిందని, అలా అర్ధాంతరంగా ఆగిపోయిన నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. నెల్లూరుజిల్లా దగదర్తి, చిత్తూరుజిల్లాలోని కుప్పం, పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లలో గతంలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టులు, ఎయిర్ స్ట్రిప్‌ల నిర్మాణంతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని కూడా చేపట్టాలని నిర్ణయించామని సీఎం చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 12 నుంచి 14 విమానాశ్రయాలను ఏర్పాటుచేయాలన్నది ప్రభుత్వం ఆలోచన అన్నారు.

# ఏపీ జెన్‌కో యాష్‌పాండ్‌కు.. గండి



## పంటపొలాల్లో బూడిదనీటి వెల్లువతో రైతుల్లో ఆందోళన

ముత్తుకూరు మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీ దామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో థర్మల్ ప్రాజెక్టుకు చెందిన 1వ దశ యాష్‌పాండ్ (బూడిద చెరువు)కు ఇటీవల 8 మీటర్లకుపైగా గండిపడడంతో, ఆ చెరువులో ద్రవరూపంలో ఉన్న బూడిద చుట్టు పక్కలున్న పంటపొలాలను ముంచెత్తింది. రొయ్యల చెరువుల్లోకూడా బూడిద ప్రవాహం వచ్చి పడింది. దీంతో ముసునూరువారిపాళెం, పైనాపురం, నేలటూరు, వరకవిపూడి తదితర గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ బూడిద భూమి లోపలకి ఇంకిపోతే పంటపొలాలకు బాగా నష్టం వాటిల్లుతుందంటూ రైతులు గోడుగోడుమన్నారు. అంతేకాక భూగర్భ జలాలకు సైతం ముప్పు వాటిల్లుతుందని స్థానికులు చెప్తున్నారు. చెరువులో ద్రవరూపంలో ఉన్న బూడిదను రీసైక్లింగ్ చేసేందుకు అమర్చిన విద్యుత్‌మోటార్లు చెడిపోవడంతో ఈ ప్రమాదం జరిగివుంటుందని భావిస్తున్నారు. దీంతో దాదాపు 2వందల ఎకరాల్లో బూడిద మేట పడిందని అంటున్నారు. జెన్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందంటూ ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం, జెన్‌కో యాజమాన్యం కలిసి ఆ బూడిద మేటను వెంటనే తొలగించి తమను నష్టాల బారినుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# శ్రీసిటీలో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు

## • కీలక అంశాలపై మాజీ పోలీస్ ఐజీ దామోదర్ వివరణ








దేశంలో కొత్తగా అమలులోకి వచ్చిన నేర చట్టాలపై ఇటీవల శ్రీసిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలకు క్రిమినల్ చట్టాలపై న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తున్న ఇ.దామోదర్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఆ చట్టాలలోని పలు కీలక అంశాలను వివరించారు. శ్రీసిటీలోని పలు పరిశ్రమలకు చెందిన మానవ వనరుల విభాగం మేనేజర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, లీగల్ ఆఫీసర్లు, స్థానిక పోలీస్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లు నూతన చట్టాలలో పేరు మార్పుతో వరుసగా భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బిఎస్‌ఏ)గా మారాయని ఈ సందర్భంగా ఆయన విశదీకరించారు. తొలుత, దామోదర్‌కు స్వాగతం పలికిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు ధన్యవాదాలు చెప్తూ, గతంలో నెల్లూరు ఎస్పీగా పనిచేసిన సమయంలో దామోదర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# ఉర్రూతలూగించిన 'కళాంజలి' సంగీత సంబరం




***అత్యద్భుతమైన పాటలతో, వీనులవిందైన సంగీతంతో నెల్లూరు పురమందిరం పులకించిపోయింది. జీ లిటిల్ ఛాంప్స్ విజేత, ప్రసిద్ధ గాయని చిన్నారి సాయివేదవాగ్దేవి అలవోకగా మృదుమధురంగా పాడుతుంటే శ్రోతలు ఆ సంగీతఝరిలో పరవశించిపోయారు. 'పాడుతా తీయగా' చిన్నారుల గాన లాహిరిలో మైమరచిపోయారు. నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు 'కళాంజలి' అనంత్ సారధ్యంలో టౌన్‌హాలు(పురమందిరం)లో ఏర్పాటుచేసిన ఈ సంగీత సంబరం అంబరాన్నంటింది.***

నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ ఆదివారం నిర్వహించిన 'సంగీత సంబరం' ఆద్యంతం మనోహరంగా సాగింది. ఆ సాయంత్రం టౌన్‌హాలు సంగీతాభిమానులతో క్రిక్కిరిసిపోయింది. 'పాడుతా తీయగా' చిన్నారులు జ్ఞానశ్రీ, అనూష, గాయత్రి, అజిత్‌రామ్, శ్రీకృతి పాడిన పాటలు, ప్రత్యేకించి సాయివేదవాగ్దేవి సరిగమపదనిసల విన్యాసాలతో ఆలపించిన గీతాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. పాత, కొత్త పాటల సమ్మేళనంతో జరిగిన ఈ సంగీత ఝరి సంగీతాభిమానులని ఆనందపరవశుల్ని చేసింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న తుంగా శివప్రభాత్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, కళాంజలి అంటేనే సాంస్కృతిక రంగంలో ఒక బ్రాండ్‌గా మారిందని, గత 36 సంవత్సరాలుగా నెల్లూరులో కళాంజలి సంస్థ ఎన్నో సంగీత సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ఎందరికో అవార్డులు బహుకరించి ప్రోత్సహించిందని కొనియాడారు. ఎక్కడా జంకుబొంకు లేకుండా అత్యద్భుతంగా గానం చేసిన ఈ చిన్నారులను చూస్తే, వీరు తల్లి గర్భం నుంచే సంగీత సాధన చేస్తూ జన్మించారా అన్న సందేహం కలుగుతుందని అన్నారు. ఆ చిన్నారులను ప్రోత్సహిస్తున్న తల్లితండ్రుల గొప్పదనాన్ని ఆయన ప్రస్తుతించారు. కళాంజలి సంస్థ ఎంతో కాలంగా దాతల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తుండడం సంతోషదాయకమన్నారు. ఆ సంస్థకు ఒక మూలనిధి ఉంటే బావుంటుందని ఆయన అభిప్రాయపడుతూ, కనీసం పాతిక లక్షల రూపాయల నిధి ఉంటే, తద్వారా మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని, అందుకు కళాంజలి అనంత్ సిద్దపడితే, తనతోపాటు, తన మిత్రుల ద్వారా కూడా ఆ నిధి సమకూరేందుకు సహకరిస్తామని శ్రోతల కరతాళధ్వనుల మధ్య చెప్పారు. విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, టౌన్‌హాలు ట్రస్టుబోర్డు సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఉప రవాణా కమిషనర్ చందర్, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడు, కళాంజలి సంస్థ గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొని ఆ చిన్నారులందరినీ అభినందించి జ్ఞాపికలందజేశారు. ఈ సందర్భంగా తన గానమాధుర్యంతో, సుస్వరస్వరంతో, సరిగమ పదనిసల విన్యాసంతో శ్రోతలను మైమరపింపజేసిన చిన్నారి గాయని, జీ లిటిల్ చాంప్స్ విజేత సాయివేదవాగ్దేవి (విశాఖపట్నం)కి 'స్వర రాగమయి' అనే బిరుదునిచ్చి, ముఖ్యఅతిథులందరి చేతులమీదుగా 'కళాంజలి అవార్డు'ను బహుకరించారు. అనంతరం, కళాంజలి నిర్వహించిన సంగీత పోటీల్లో విజేతలైనవారికి బహుమతులందజేశారు. కార్యక్రమ విజయానికి తనకి సహకరించిన వారందరికీ 'కళాంజలి' అనంత్ కృతజ్ఞతలు తెలిపారు.



# నూతన విద్యా విధానంతోనే.. అభ్యున్నతి

## రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

మనదేశంలో గత 34 సంవత్సరాలుగా విద్యా విధానంలో ఎటువంటి మార్పుచేర్పులు లేవని, ప్రపంచంలో విద్యా-శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానంతోనే దేశానికి అభ్యున్నతి, సత్వర అభివృద్ధి కలుగుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ చెప్పారు. అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంగ్ (ఏబీఆర్‌ఎస్ ఎమ్) మరియు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత, 'ఇంప్లిమెంటేషన్ అండ్ ఛాలెంజెస్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ -2020' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలోని రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వ రంగాలలో ప్రభుత్వ ఉద్యోగాలు మూడు కోట్లు మాత్రమే ఉన్నాయని, కానీ 26కోట్ల మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించవలసి ఉందని అన్నారు. అందువల్ల ప్రభుత్వ రంగంలోను, ఐటి, ఫార్మా, అగ్రికల్చర్, ఇన్ఫ్రా, డెయిరీ మొదలైన రంగాలలోను కాకుండా ప్రతివిద్యార్థి స్వయం ఉపాధి పొందే విధంగా నూతన జాతీయ విద్యా విధానంలో దాదాపు 45 స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టారని అన్నారు. వీటిలో ఏ కోర్సులో అయినా తర్ఫీదు పొందిన తర్వాత స్వయం ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలు ప్రపంచంలో ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని, వారి విద్యాభ్యాసమంతా కూడా మాతృభాషలోనే జరుగుతుందని ఆయన అంటూ, మనదేశంలో కూడా విద్యార్థులకి అనుగుణంగా మాతృభాషలోనే విద్యను బోధించే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబిఆర్‌ఎస్‌ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రంగనాథ్, సెమినార్ కన్వీనర్ ప్రొఫెసర్ శివరాం ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# చదువుతోనే ఉన్నత శిఖరాలు

## ఎమ్మెల్యే పాశం సునీల్



చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరవచ్చని, తను కూడా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసి రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరులోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు ఇటీవల విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. తాను కూడా ఇదే కళాశాలలో చదువుకున్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జిలాని బాషా, మాజీ కౌన్సిలర్ చెంచురామయ్య, సీఐ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా ఇసుక అందించాలి



భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ఈ నెల 5న ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలుచేసి కార్మికులకు పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, రమణయ్య, శేఖరాచారి, భవన నిర్మాణ కార్మిక సంఘ గౌరవాధ్యక్షులు పుట్టా శంకరయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విపిఆర్‌కు బ్రాహ్మణ సేవా సంఘం సత్కారం



పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఈ నెల 4వ తేదీ గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు ఆయన నివాసంలో కలిశారు. బ్రాహ్మణ సంఘానికి విపిఆర్ అందిస్తున్న సహాయసహకారాలకు కృతజ్ఞతగా ఆయనను వేదాశీర్వచనాలతో దీవించి, సత్కరించారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘానికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆలూరు శిరోమణిశర్మ, సంఘ ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, సభ్యులు దూబగుంట శ్రీనివాసరావు, కడివేటి రామ్మూర్తి, గుండ్లపూడి శ్రీనివాస్‌కుమార్, వేపకొమ్ము నరసింహారావు, కమలకుమారి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



చిల్లకూరు మండలం పాలిచర్లవారిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల 30 మంది విద్యార్థులకు రొటేరియన్ చల్లా రామ్‌కుమార్ దాతృత్వంతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాలరెడ్డి, రోటరీ వెస్ట్‌క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు, కార్యదర్శి గిరిబాబు, జోనల్ సెక్రెటరీ ధనుంజయరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# న్యాయవాదులకు ఉచిత వైద్యపరీక్షలు

గూడూరు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులకు ప్రాంతీయ వైద్యశాల వైద్యులు ఈ నెల 6వతేదీ ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్విన్ సుల్తానా బేగం మాట్లాడుతూ, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించు కోవాలని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, న్యాయవాదులు, వైద్య సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పొరుగున అస్థిరత.. భారత్‌కు మంచిది కాదు

సైనిక నియంతృత్వం, సాంస్కృతిక, పౌర అణచివేతపై పోరాడి సాధించుకున్న బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యం కుప్పకూలింది. పాకిస్థాన్ దాష్టీకాలపై ముజిబుర్ రెహ్మాన్ నేతృత్వంలో వీరోచితంగా పోరాడి 1971లో బంగ్లాదేశ్ సార్వభౌమదేశంగా అవతరించింది. అప్పటి నుంచి క్రమక్రమంగా ఎదుగుతూ స్వయంసమృద్ధి సాధించింది. కానీ 53ఏళ్లలోనే ప్రజాస్వామ్య పునాదులు కదిలిపోయి మళ్లీ సైన్యం నియంత్రణలోకి వ్యవస్థ వెళ్లిపోయింది. జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన కుటుంబ వారసురాలే దేశం విడిచిపోవాల్సిన పరిస్థితి ఎదురయింది.

బంగ్లాదేశ్‌లో కొన్ని రోజులుగా తీవ్ర హింస చెలరేగి, దాదాపు 300 మంది మరణించారు. విద్యార్థులు ఏకంగా రాజధాని ఢాకాలోని ప్రధాని నివాసానికి మార్చ్ తలపెట్టడంతో 45 నిమిషాల్లో రాజీనామా చేయాలని సైన్యాధ్యక్షుడు ప్రధాని షేక్ హసీనాకు అల్టిమేటమ్ జారీచేశారని మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో షేక్ హసీనా రాజీనామా చేసి సైనిక విమానంలోనే భారత్‌కు వచ్చారు. ఢిల్లీలోని సురక్షిత నివాసంలో ఉన్నారని మీడియా వార్తలు వెల్లడిస్తున్నాయి. ఆమెకు తిరిగి బంగ్లాదేశ్ వెళ్లే ఉద్దేశం, రాజకీయాల్లో కొనసాగే ఆలోచన లేనట్లు తెలుస్తోంది. సైనిక ఆధిపత్యంలోని నియంతృత్వ కబంధహస్తాల నుంచి స్వేచ్ఛను ప్రసాదించిన బంగబంధు ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె, 15ఏళ్ల పాటు ప్రధానిగా దేశాన్ని సమర్థవంతంగా నడిపిన విద్యాధికురాలైన షేక్ హసీనా అవమాన భారంతో మాతృదేశాన్ని వీడాల్సి రావడం దురదృష్టకరమే కాదు.. ప్రజాస్వామ్యానికి గొడ్డలివేటు.

## అల్లర్లకు కారణమేమిటి?

బంగ్లా విముక్తి పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడాన్ని విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. తొలుత 1972లో స్వాతంత్ర్యసమరయోధులకు 30శాతం, మహిళలకు 10శాతం కోటా కల్పించారు. 1996లో తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అవామీలీగ్ అధినేత, షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె షేక్ హసీనా ఈ కోటాను స్వాతంత్ర్య సమరయోధుల సంతానానికి పొడిగించారు. మరోసారి ప్రధాని అయ్యాక 2011లో ఈ కోటాను స్వాతంత్ర్య సమరయోధుల మనవళ్లు, మనవరాళ్లకు కూడా పొడిగించారు. విద్యార్థుల్లో పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో 2018లో హసీనా ప్రభుత్వం మొత్తం రిజర్వేషన్లనే ఎత్తివేసింది. దీనిపై కొంతమంది హైకోర్టుకు వెళ్లడంతో స్వాతంత్ర్యసమరయోధుల కుటుంబాలకు కోటాను పునరుద్ధరిస్తూ ఈ ఏడాది జులైలో తీర్పు వచ్చింది. దీంతో దేశ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు పెల్లుబికాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు 30శాతం కోటాను 5శాతానికి తగ్గించింది. మరో 2శాతం కోటాను ఇతర వర్గాలకు కేటాయిస్తూ తీర్పు ఇచ్చింది.

కోర్టులు తీర్పులకు ముందు హసీనా ప్రభుత్వం పూర్తిగా కోటానే ఎత్తివేసింది. సుప్రీంకోర్టు తీర్పు కూడా ప్రతిభకు అనుకూలంగానే ఉంది. అయినా నిరసనలు ఆగకపోవడం, ఈసారి నిరసనకారులు హసీనా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం, ప్రధాని నివాసానికి మార్చ్ తలపెట్టడం చూస్తుంటే సహజసిద్ధమైన భావోద్వేగ నిరసనలుగా అనిపించడం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షాలు నిరసనలకు మద్దతు తెలపడం సహజం. కానీ సైన్యాధ్యక్షుడు వాకర్ ఉజ్ జమాన్ ప్రధాని రాజీనామాకు అల్టిమేటం జారీచేయడం చూస్తుంటే సాధారణ ఆందోళనలకు భిన్నమైన వ్యవహారంగా కనిపిస్తోంది. సైనిక జనరల్‌గా ఆయన్ను నియమించాలని షేక్ హసీనా భావించినప్పుడు, ఆయనతో జాగ్రత్త అని భారత భద్రతాధికారుల నుంచి సూచనలు వెళ్లినట్లు, ఆమె పెడచెవిన పెట్టినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి.

బంగ్లాదేశ్‌లో వైమానిక స్థావరం ఏర్పాటు కోసం అమెరికా ఒత్తిడి తెచ్చిందని, తాను ససేమిరా అన్నానని, పర్యవసానంగా కొన్ని పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఊహించానని షేక్ హసీనా ఇటీవల వ్యాఖ్యానించారు. అవామీలీగ్ సానుభూతి పరుల ఆస్తులపై దాడులు, విధ్వంసం, మైనార్టీ వర్గాలపై దాడులు చూస్తుంటే ఆమెను అధికారంలోంచి తప్పించడంలో మతఛాందస వాదులు, ఇతర బాహ్యశక్తుల ప్రమేయాన్ని తోసిపుచ్చలేమన్న వాదనలు వినిపిస్తున్నాయి. అక్కడి అల్లర్లు కేవలం ఒక భావోద్వేగంతో చేసినవిగా మాత్రమే కనబడడం లేదు. అగ్నికి వెరవెరో ఆజ్యం పోసినట్లు అక్కడి పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. షేక్ హసీనా నర్మగర్భంగా అమెరికాను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, తాజా అస్థిరత వెనక చైనా, పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ హస్తం ఉండొచ్చని వస్తున్న కథనాలు చూస్తుంటే కుట్ర కోణం ఉండవచ్చని కొంతమంది పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

కొన్నేళ్లుగా భారత్ ఇరుగు, పొరుగు దేశాల్లో అస్థిరత రాజ్యమేలుతోంది. 2022లో తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో శ్రీలంక అధ్యక్షుడు రాజపక్స అధికార నివాసంలోకి వేల మంది నిరసనకారులు చొచ్చుకెళ్లడంతో ఆయన దేశం విడిచివెళ్లిపోయారు. నేపాల్‌లోనూ రాజకీయ అస్థిరత కొనసాగుతోంది. మాల్దీవుల్లో భారత్ వ్యతిరేక, చైనా అనుకూల ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇవన్నీ కేవలం ఆయా దేశాల అంతర్గత వ్యవహారాలుగా భావించలేం. పొరుగున నిత్యం అగ్గిరాజుకుంటుంటే అది మనకు మంచిది కాదు. పొరుగున రాజుకున్న కుంపటిని అడ్డం పెట్టుకుని మన దేశంలో మంటలు ఎగదోయాలనుకునే శక్తులు సిద్ధంగానే ఉంటాయి. ఈ విషయంలో అటు ప్రభుత్వం, ఇటు పౌరసమాజం నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. షేక్ హసీనా భారత్‌కు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి తాజా పరిణామాలను వివరించడం మంచిదే. ముఖ్యమైన అంశాల్లో ప్రభుత్వం, ప్రతిపక్షం ఏకతాటిపై ఉంటే ఏ బాహ్యశక్తుల కుటిల యత్నాలూ పని చేయవు. అదే సమయంలో కీలకమైన అంశాల్లో ప్రభుత్వం చూపుతున్న పరిణితి మన ప్రజాస్వామ్య వ్యవస్థను పరిపుష్టం చేస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం తీసుకొచ్చిన సందర్భంలో మనదేశంలోనూ కొన్ని వర్గాల నుంచి తీవ్ర నిరసనలు వచ్చాయి. కానీ ప్రభుత్వం ఎంతో శాంతియుతంగా వ్యవహరించడంతో ఎక్కడా హింస చెలరేగలేదు. కీలకమైన 370 అధికరణ రద్దు వంటి విప్లవాత్మక చర్యల సందర్భంగానూ ఎంతో పరిణితితో వ్యవహరించింది. ఇటీవల ఎస్సీ, ఎస్టీ వర్గాల కోటా ఉపవర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునివ్వడమూ మన వ్యవస్థల దూరదృష్టికి నిదర్శనం. కాలానుగుణంగా విధానాల్లో మార్పులు చేసుకునే పరిణితిని మన ప్రజాస్వామ్య వ్యవస్థ సాధించగలిగింది. బంగ్లాదేశ్‌లో తగిన సమయంలో అటువంటి పరిణితి చూపించ లేకపోవడం తాజా పరిణామాలకు ఒక కారణం. ఈ నేపథ్యంలో మన దేశంలో వ్యవస్థ సజావుగా ఉందని సరిపెట్టుకోకుండా ఇరుగుపొరుగు దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపుష్టమయ్యేలా భారత్ అంతర్జాతీయ స్థాయిలో కృషి చేయాల్సి ఉంది. విదేశీవ్యవహారాల విధానాన్ని ప్రభుత్వం సత్వరం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




రాముడు... కొరివిమంటలు పట్టుకొన్న మనుష్యులచే అడవిలో చుట్టుముట్టబడ్డ గొప్ప ఏనుగులాగా అయిపోయాడు.

ఇంతగా వారిస్తున్నా, ఆయన బుద్ధి మాత్రం ఒకదానియందే స్థిరంగా ఉంది. అదియే "ధర్మం".

(ధర్మమార్గం నుండి రవ్వంతైనా ప్రక్కకు జరుగడు. నిశ్చయాత్మకమైన, నిర్ణయాత్మకమైన బుద్ధి ధర్మంనందేగలవాడు ఒక్కడే!.. అతడే "రాముడు")

తన బుద్ధి మారకుండా దృఢంగా నిలుచుని, స్థిరగంభీర కంఠంతో, లక్ష్మణా ఎందుకు నీవు అమ్మతో చేరి నన్ను బాధిస్తావు? కష్టపెడతావు?

అర్థము, కామము నాకు ముఖ్యము కావు!

వాటికొరకు నాలో వెంపర్లాట లేదు!

ధర్మం పాటించడమే నాకు చాలా ఇష్టం,

ధర్మపథం నాకిష్టమైన మార్గం.

తండ్రి మనకు పూజ్యుడు, ఆయన వృద్ధుడు కావచ్చుగాక, కామ ప్రేరితుడు గావచ్చుగాక, ఆయన కోపంగానైనా, సంతోషంగానైనా ఆజ్ఞాపించినప్పుడు ధర్మదృష్టి కలవాడెవడైనా చేయకుండా ఉంటాడా!.

కేవలం రాజ్యం, భోగాల కొరకు గొప్పగొప్ప ఫలితాలిచ్చే ధర్మమార్గం నేను వదలను గాక వదలను...

**యశోహ్యహం కేవలరాజ్య కారణాత్**

**న పృష్ఠతః కర్తుమలం మహోదయమ్!**

ఈ జీవితం అల్పకాలికమైనది. దీనికోసం తుచ్ఛమైన రాజ్యం ధర్మవిరుద్ధంగా సంపాదించను.

శ్రీ రామసింహం ధర్మగర్జన చేసింది.

లక్ష్మణా నీవన్నట్లుగా ఈ పట్టాభిషేకం జరిగిందే అనుకో!

అప్పుడది ఎవరికి అవమానం?

మన తండ్రికి!

ఎవరికి మనస్తాపం?

మన తల్లి కైకకు!

మన తండ్రికి గానీ, తల్లులకు గానీ ఇంతకు మునుపెన్నడైనా లేశమైనా అప్రియం చేసినట్లు నాకు గుర్తులేదు.

మన తల్లి తండ్రులు ఎట్టి భీతి, మనస్తాపం లేక జీవింతురు గాక. నా తండ్రి అసత్యవాది అన్నపేరు ఎవరికి బాధ! చివరకు అది మనకే బాధ!

తల్లితండ్రులకు కలిగిన మనస్తాపం మనకు కలిగినట్లే!. ఈ కారణం చేతనే నేను అడవులకు వెళ్ళటానికి నిశ్చయించుకొన్నాను. ఇచ్చిన రాజ్యం తీసుకొన్నది తండ్రిగారు, తల్లి కైక కాదు!...

.... ఇది దైవనిర్ణయం!

నాకు నా తల్లులపట్ల ఏవిధమైన భేద భావములేదు!

లక్ష్మణా దైవం నడిపించునట్లు నడవడమే తప్ప దానిని నిగ్రహించుటకు ఏ ఉపాయమూ కానరాదు!.

లక్ష్మణా! నా వనవాసవ్రతానికి ఈ అభిషేక జలాలతో స్నానం చేసెదను! ఊహూ! వద్దులే ఇవి రాజద్రవ్యములు! అందుకు వాడరాదు!

రాజ్యమా? వనవాసమా?

వనవాసమే సుఖప్రదం! శుభప్రదం!

**రాజ్యం వా వనవాసో వా! వనవాసో మహోదయః!**

రాముడి మాటలు వింటున్న లక్ష్మణుడు ఇంకా బుసలుకొడుతూనే ఉన్నాడు! కనుబొమ్మలు విరిచి చూడటానికే భయంకరంగా ఉన్న ఆయన రూపం బాగా కోపంతో ఉన్న సింహపు ముఖంలాగా ఉన్నదట.

నేత్రాగ్రాలతో రాముడిని అడ్డంగా చూస్తూ! అన్నా! సుక్షత్రియుడవు, మహావీరుడవు! నీవు కన్నెర్రచేస్తే లోకాలే గజగజవణికిపోతాయి!

పాపాత్ముడైన రాజు, ఆయన భార్య కైక మీద నీకు కోపం ఎందుకు కలుగటలేదు! పైగా దైవనిర్ణయం అంటున్నావు! నీ సంకల్పం బలవత్తరమైనదైతే దైవం బలహీనం కాదా?

వారిది వంచన! అది ధర్మరూపాన్ని సంతరించుకొంది!

ఎప్పుడో ఇచ్చిన వరం అప్పుడే తీర్చక నేడిలా నిన్ను మోసం చేయటానికి దానిని ఏల సాకుగా చూపవలె!.

నీ రాజ్యం నీకు కాకుండా చేసిన ఈ ధర్మాన్ని నేను ద్వేషిస్తున్నాను!

మనోధైర్యం లేనివాడు మాత్రమే దైవంపై ఆధారపడియుండును, నీ వంటి వీరుడు కాదు!.

దైవమట దైవం!

నాకెవరు అడ్డువస్తారో చూస్తాను!

నీవుకాదు అడవులకు వెళ్ళవలసింది !

..వారు!

అన్నా నా ఈ బలమైనబాహువులు కేవలం జనులు వీక్షించడానికి కాదు!



ధనుస్సు అలంకారం కొరకు కాదు,

ఖడ్గం నడుముకు వేళ్ళాడదీయటానికి కాదు!

బాణాలు అలా వృధాగా పడి ఉండటానికి కాదు!.

ఈ నాలుగూ శత్రువులను సమూలంగా నిర్మూలించడానికే.

క్షణకాలంలో గజ, తురగ, పదాతిదళముల పీనుగులపెంటగా మార్చివేస్తాను ఈ అయోధ్యను! అడ్డువచ్చినవారిని కత్తికొకకండగా నరికివేస్తాను! దశరథుని నేడే సింహాసనం నుండి క్రిందకు దించివేస్తాను!

బుసలుకొడుతూ తిరుగుబాటుకు సిద్ధమైన తమ్ముని కన్నీరు తుడిచి... లక్ష్మణా! నాన్నమాట నాకు బంగారు బాట!

ఆయన మాట మీదనే నేను స్థిరంగా నిలిచి ఉన్నాను.

ఇంక వ్యర్థవాదములు వద్దు!. అని శాంతగంభీరంగా పలికిన రాముని చూచి కౌసల్య... ఇలా అన్నది!.

తండ్రి ఆజ్ఞపాటించుట తప్ప వేరు కర్తవ్యం లేదు అన్న రాముని దృఢసంకల్పం కౌసల్య పూర్తిగా అర్థం చేసుకొన్నదై, రామా! అని డగ్గుత్తికతో అస్పష్టంగా పలికింది. ఆమె గొంతు పూడుకుపోయింది!

అతి కష్టం మీద మాటలు పెగుల్చుకుంటూ.. రామా! తాపసవేషధారివై నీవు ఉంఛవృత్తితో ఎలా జీవిస్తావురా!..

నాయనా! ఎండ కన్నెరుగని రాకుమారుడివి! సుకుమారుడివి! నీ సేవకులు, నీ మిత్రులు అయిన కారణంగా వారందరూ మన నగరంలో అందరికంటే ఉన్నతంగా జీవిస్తారే, మహారుచికరమైన ఆహారం ప్రతి దినమూ భుజిస్తారే! మరి నీవో... రోజూ కందమూల ఫలములతో పొట్ట ఎలా నింపుకుంటావురా తండ్రీ!

.. (సశేషం)

# నగరం కాదు.. నరకం

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకంటే చారిత్రాత్మక నెల్లూరునగర దుస్థితి నేడు అదే. ఆనాటి స్వాతంత్ర్యోద్యమం నుండి మూడు దశాబ్దాల నాటి సారా వ్యతిరేక సమరం వరకు, ఎం దరో త్యాగధనులకు జన్మనిచ్చిన జిల్లా నెల్లూరుజిల్లా. అనేక రంగాలలో సంచలనాలకు సారధులుగా మన నెల్లూరీయులు ప్రపంచమంతా విస్తరించి ఉన్నారు. అలాంటి జిల్లా ప్రధాన కేంద్రమైన నెల్లూరు నగర పరిస్థితి ఇప్పుడు దయనీయంగా మారింది. నగరం మూడు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే, ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ముగ్గురూ ఇది తమ పని కాదన్నట్లుగా ఎవరికివారే యమునా తీరే... అన్నట్లుగా వుంటూ నగరాభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో గడచిన అయిదేళ్లుగా పట్టణ పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యింది.

కవి రాసుకున్న అక్షర సత్యాలలో ఒక్కొక్క అంశాన్నీ పరిశీలిస్తూ వస్తే...

## మురుగు గుంటలు...

నగరమంతా మురికి కూపంగా మారిపోయింది. ఉదాహరణకు నగర నడిబొడ్డులో హైదరాబాదు బంజారాహిల్స్ తరహాలో పేరుగాంచిన మాగుంట లేఅవుట్‌లో సైతం పూర్తిస్థాయి రోడ్ల నిర్మాణం జరగ లేదు. ఇక్కడ ఖాళీగా ఉన్న స్థలాలలో డ్రైనేజీలను తలపించే స్థాయిలో మురుగునీరు నిల్వ ఉంటాయి. ఆ స్థలాలలోనే పదులకొద్దీ పందులు, వందలకొద్దీ పాములు, లక్షల కొద్దీ దోమలు కాపురం చేస్తుంటాయి. దీంతోపాటు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చాలాకాలం క్రితం ఏర్పడ్డ 'ఇస్కాన్ సిటీ' లే అవుట్‌లో కూడా కనీసం 40శాతం రోడ్లు కూడా వేయలేదు. అప్పటి సిటీ శాసనసభ్యుడు మంత్రి పదవి కూడా వెలగబెట్టారు. ఆయన అదే లే అవుట్లోనే కాపురం ఉంటారు. ఆయన ఇంటివరకు మంచి రోడ్డు వేయించు కున్నారు. ఇంటి పరిసరాలను ప్రభుత్వ సొమ్ముతో అందంగా తీర్చి దిద్దుకున్నారు. మిగిలిన లే అవుట్‌ని మాత్రం గాలికొదిలేశారు. ఇస్కాన్ సిటీ లే అవుట్ రూరల్ నియోజకవర్గంలో ఉండడంతో తనకేంపని అన్నట్లుగా ఆయన చూసీచూడనట్లు వదిలేశాడు. 80శాతం పైనే అభివృద్ధి చెందిన లే అవుట్లో జనావా సాల మధ్యే ఇలాంటి దుస్థితి వుంటే ఇక నగరంలో మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో మనం ఊహించుకోవచ్చు.

## అక్రమ కట్టడాలు!

రెండు తెలుగు రాష్ట్రాలలో అక్రమకట్టడాల పోటీ నిర్వహిస్తే నెల్లూరుకే ప్రథమ స్థానం వస్తుంది. అంతటి స్థాయిలో ఇక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. మాస్టర్ ప్లాన్‌లో వున్న రోడ్డుని మూసేసి అడ్డంగా కళ్యాణమండపం కట్టినా ఇక్కడ అడిగే నాధుడుండడు. మూడంతస్తులకి అనుమతులు తీసుకుని ఆరంతస్తులు కట్టేసినా పట్టించుకునే వారు ఉండరు. నగరంలో నిబంధనల ప్రకారం ఒక్క కట్టడం కూడా ఉండదు. దాదాపుగా అన్ని అపార్ట్‌మెంట్ సముదాయాలలోనూ ఒక్క అంతస్తునైనా అనుమతి లేకుండా కట్టేసుంటారు. బిఆర్ఎస్ పథకం వచ్చినప్పుడు అక్రమాన్ని సక్రమం చేసుకుందాంలే అన్న ధీమా!

## కోట్లకొద్దీ దోమలు

రాత్రీపగలూ అన్న తేడా లేకుండా కోట్ల సంఖ్యలో దోమలు ప్రజల శరీరాలని తూట్లు పొడుస్తుంటాయి. దోమల నిర్మూలన కోసం తీసుకోవలసిన జాగ్రత్తల విషయంలో కార్పొరేషన్ పూర్తిగా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. పక్క రాష్ట్రాలలోని జనం సైతం "మీ నెల్లూరు ముదురుదోమలకి ప్రసిద్ధి అంట కదా!" అని అడిగే ఘనతని నెలూరు నగరం సాధించుకుంది.

## గతుకుల రోడ్లు

నగరంలోని ప్రధాన రహదారులు సైతం గతుకుల మయంగా తయారయ్యాయి. రోడ్లు భవనాల శాఖ సైతం నెల్లూరునగర ముఖ్య మార్గాల గురించి పట్టించు కోవడం మానేసింది. ఇక చిన్నచిన్న సందులు గొందుల సంగతైతే చెప్పనక్కర లేదు. రాజకీయ నాయకుల వద్ద పలుకుబడి వున్నవాళ్ళు, పైరవీలు చేసే కాంట్రా క్టర్లు తమ పరపతిని ఉపయోగించుకుని వాళ్ల ఇళ్ల వరకు సిమెంటు రోడ్లు వేయించుకుని మిగిలిన దాన్ని వదిలేస్తున్నారు. తమ ఇళ్ళకి అవతల వున్నవారిని మీ చావు మీరు చావండి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

## అదుపులేని ఆక్రమణలు

ఇక నగరంలో ఆక్రమణలకైతే అడ్డు ఆపు లేదు. మునిసిపల్ నిబంధనల ప్రకారం వదిలిపెట్టిన మార్జిన్ స్థలాలలో సైతం తాత్కాలిక కట్టడాలని నిర్మించి బాడుగలకి ఇచ్చేస్తున్నారు. ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, చిన్నబజార్, పెద్దబజార్, ముత్తుకూరురోడ్డు, మినీబైపాస్‌లతో పాటు కొత్తగా అభివృద్ధి చెందుతున్న మాగుంట లేఅవుట్, గోమతినగర్‌లలో కూడా ఇదే పరిస్థితి. తమ ఇష్టానుసారం రోడ్డు మార్జిన్లని ఆక్రమించి దుకాణాలు తెరిచేస్తున్నారు.



అన్నమయ్య కూడలిలో అయితే ఏకంగా ప్రభుత్వ డైరీ దుకాణమే నడిరోడ్డుపై కట్టారు. ఎవడేం పీకుతారో పీక్కోండి అన్నట్లుగా ఆ దుకాణం వెక్కిరిస్తుంటుంది. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ మొత్తానికి పెద్ద ఆటంకంగా ఆ దుకాణం దర్శనమిస్తోంది. ఇదేంటి బాబు అని అడిగితే, ప్రజాప్రతినిధులకి నెలనెలా బాడుగ కడు తున్నాం, అడగడానికి మీరెవరని దుకాణదారు అడిగిన వారిమీదే తిరగబడడం మరో విడ్డూరం.

## పార్కింగ్ వ్యవస్థ లేని వ్యాపార సముదాయాలు!

వ్యాపారాల కోసం భారీ నుండి అతి భారీ సము దాయాలు నిర్మిస్తున్నారు. కనీస పార్కింగ్ సౌకర్యం కూడా లేకుండా వాటిని వ్యాపారం కోసమే వినియో గించేస్తున్నారు. నగరంలో ప్రప్రథమంగా ఏర్పడిన ఐదా మాల్ యాజమాన్యం అయితే రోడ్లని తమ పార్కింగ్ అడ్డాలుగా మార్చేసుకున్నారు. మాల్‌కి అటు వున్న రోడ్లని ఆక్రమించి ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయిస్తున్నారు. దీనిని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. ఎందుకంటే ఆ మాల్ యాజమాన్యానికి కావలసినంత పలుకుబడి వుంది. గత ఎన్నికల సమయంలో నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి వైసీపీ తరఫున పోటీచేసిన విజయసాయిరెడ్డి స్వయంగా మాల్‌ని సందర్శించి వారికి "నేను విన్నా... నేనున్నా" రెచ్చి పోండి, కావాలంటే మాల్ ముందున్న రోడ్డు కూడా ఆక్రమించుకోండి అని పూర్తి భరోసా కల్పించారని సమాచారం. మరిప్పుడు కొత్త ప్రభుత్వం, ఆ ప్రభుత్వ నేతలు, అధికారులు ఏం అభయం ఇచ్చారో ఆ పైవాడికే తెలియాలి.

ఇక డాక్టర్ల సామ్రాజ్యం... పొగతోటలో అయితే వారిదే ఇష్టారాజ్యం అయిపోయింది. కోట్ల రూపా యలుపెట్టి ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్నారు కానీ, తమ వద్దకి వచ్చే పేషంట్లకి పార్కింగ్ సదుపాయం కల్పిం చడంలేదు. ఒకవేళ క్రింది అంతస్తు పూర్తిగా పార్కింగు కోసం వదిలేసినా అక్కడ తమ సొంత కార్లనే పార్కింగ్ చేస్తున్నారు. వారి సిబ్బందితో పాటు వచ్చే రోగులు కూడా రోడ్లపైన పార్కింగ్ చేయాల్సిందే.

## అవినీతిలో మునిగిపోయిన కార్పొరేషన్ అధికారులు!

నెల్లూరు కార్పొరేషన్ అవినీతిలో, లంచగొండి తనంలో అగ్రగామిగా ఉందంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ టౌన్‌ప్లానింగ్‌లో పనిచేసే ఒక్కడి 'కృప'తో కోట్లు మింగేశారు. ఆ ఒక్కడికీ వందమందంత బలముంది. కారణం అతనికి వున్న రాజకీయ పలుకుబడే. ఎంతటి వారినైనా శాసించగల సత్తా ఆ ఒక్కడికీ ఉంది. ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా కార్పొరేషన్లో మాత్రం ఆయన 'కృప' లేందే ఫైలు కదలదు. రాజకీయపార్టీల నాయకులు కూడా ఆ ఒక్కడు విసిరేసే ఎంగిలి మెతుకు లకి కక్కుర్తిపడి అతడి ఆటలకి, ఆదేశాలకి గంగిరెద్దు లలా తలాడిస్తున్నారు.

## నియంత్రణ లేని ట్రాఫిక్

భారతదేశంలోనే అతి భయంకరమైన ట్రాఫిక్ వున్న నగరంగా చాలామంది బెంగళూరుని చెప్తుం టారు. అయితే అక్కడ పోలీసులన్నా, ట్రాఫిక్ నిబంధ నలన్నా నగరపౌరులకి కొంచెం గౌరవం, భయం ఉంటాయి. అలాంటి బెంగళూరు తరువాత అంతటి దౌర్భాగ్యమైన ట్రాఫిక్ వున్న నగరం నెల్లూరు. బెంగళూరులో పదోవంతు కూడా లేని నెల్లూరులో ప్రజల ట్రాఫిక్ కష్టాలు మాటల్లో చెప్పలేం. ఇక్కడ ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసు వ్యవస్థే లేదు. ఉన్నా, వాళ్ళు కేవలం ఆమ్యామ్యాలు దండుకోవడానికి తప్ప మరి దేనికీ పనికిరారు. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాల ఆగడాలు వర్ణనాతీతం. వేల సంఖ్యలో ఉన్న ఆటోలలో 80 శాతానికి మించినవి పోలీసు కుటుంబాలకి చెందినవి కావడంతో వాళ్ళ ఆగడాలను అదుపుచేసే వాళ్ళు లేరని ఒక ఆటో యజమాని చెప్పడం గమనార్హం. మోటారుసైకిళ్లపై ముగ్గురు లేదా నలుగురు ప్రయాణం చేస్తుంటారు. నిర్భయంగా ఒన్‌వేలో వెళ్లిపోతుంటారు. ఎక్కడ పనుంటే అక్కడ రోడ్లపైనే పార్కింగ్ చేసేస్తారు.

ఒకప్పుడు ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక పోలీసు వాహనాలు పెట్రోలింగ్ చేసేవి. రోడ్లపైన పార్కింగ్‌చేస్తే ఫైన్‌లు విధించేవారు. నో ఎంట్రీలోకి వాహనం వస్తే బండి సీజ్ చేసేవారు. ఇద్దరికంటే ఎక్కువమంది ద్విచక్ర వాహనంపై వెళ్తే భారీ జరిమానా కట్టించుకునేవారు. కనుచూపు దూరంలో పోలీసు వాహనం కనిపిస్తే తప్పు చేసేవారు దడుసుకునేలా వ్యవస్థ ఉండేది. ఇప్పుడవన్నీ ఏమైపోయాయో అర్థం కావడం లేదు. పట్టుమని పదిహేనేళ్ళు కూడా నిండని యువత మోటారుసైకిళ్లపై సర్కస్ ఫీట్లు చేస్తూ.. రోడ్లపై రంకెలు వేస్తున్నారు. వీళ్ళ ఆగడాలకు ముక్కుతాడు వేసే నిఖార్సైన పోలీసు అధికారే కరువైపోయాడు. అతి వేగంగా వెళ్తున్న, ముగ్గురు లేదా నలుగురు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపినా, పరిమితికి మించి ప్యాసింజర్లని ఎక్కించుకుంటున్న ఆటోలపై కేసు రాసినా వెంటనే ఏదో ఒక రాజకీయ శిబిరం నుండి ఫోన్ కాల్ వస్తుందని, ఇది తమ డ్యూటీకి పెద్ద విఘా తంగా మారిపోయిందని ఒక సీనియర్ పోలీసు అధికారి వాపోయారు.

ఇరవై ఏళ్ళ క్రితం ఇంత విస్తృతస్థాయిలో సెల్‌ఫోన్లు లేవని, కాబట్టి కేసులు రాసేసేవాళ్లమని, ఇప్పుడు ప్రతీ పనికిమాలిన వాడికి ఒక రాజకీయ నేత అండ ఉం డడం, వాడు వాళ్ళ దగ్గర నుండి ఫోన్ చేయించడం తమ చేతులకే బేడీలు వేసినట్లు అయిపోతుందని ఆయన తమ అసహాయతని వ్యక్తం చేశారు.

## స్వచ్ఛతపై స్పష్టత లేదు!

నగర కార్పొరేషన్ పన్నువసూళ్ళపై పెడుతున్న శ్రద్ధ స్వచ్ఛత, పరిశుభ్రతపై పెట్టడంలేదు. ఇంటి పన్నులు ఆలస్యమైతే మార్చాడి వడ్డీతో ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. పుర పౌరులకి అవసరమైన వసతులు ఏర్పాటు చేయడంపై మాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. ఐఏఎస్ స్థాయి అధికారులు కార్పొరేషన్ కమిషనర్లుగా వస్తే మార్పు వస్తుందని ఆశించిన నగర వాసుల ఆశలు ఫలించడంలేదు.

## నారాయణ ముందు అన్నీ సవాళ్ళే!

"ఇంట గెలచి రచ్చ గెలవాలి" అన్నది పాత సామెత. ఇలాంటి సవాలే ఇప్పుడు పురపాలక మంత్రి నారాయణ ముందు ఉంది. పురపాలక మంత్రిగా రాజధాని బాధ్యతని భుజాన ఎత్తుకున్న నారాయణకు తన సొంత నగరమైన నెల్లూరుని స్మార్ట్‌సిటీగా తీర్చి దిద్దడం పెద్ద సవాలు కానుంది. ముదురు దోమలకన్నా ముదురైన మునిసిపల్ సిబ్బంది ఆగడాలకు చెక్‌పెట్టి కార్పొరేషన్‌ని గాడిలో పెట్టడం ఇప్పుడు ఆయన ముం దున్న పెద్ద ఛాలెంజ్. గతంలో ఇదే శాఖ మంత్రిగా ఐదేళ్ల పనిచేసిన నారాయణ, ఆయన హయాంలో నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి శ్రమిం చారు. చాలాచోట్ల వాల్ టు వాల్ సిమెంటురోడ్లని వేయించారు. పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. అయితే, గత అయిదేళ్లుగా నగరం అన్ని రంగాలలో ఊహించలేనంత వెనుకబడిపోయింది. ఇది నగరమా నరకమా...? అని అనుమానం కలిగేంతగా పరిస్థితులు దాపురించాయి. ముక్కుసూటిగా పనిచేసే నిజాయతీ పరులైన అధికారులని నియమించుకుంటే కానీ నగర దుస్థితిని మార్చడం నారాయణ తరం కాదు. ఆయన ముందు తన ఇంటిని చక్కదిద్దుకోవాలంటే నెల్లూరుని రాష్ట్రంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దడానికి అవసర మైన అన్ని చర్యలు చేపట్టాలి. గత ప్రభుత్వంలో అక్రమాలకి పాల్పడ్డవారిని ముందుగా నెల్లూరు నుండి తరిమిపారేయాలి. వ్యవస్థలన్నిటినీ గాడిలో పెట్టాలి. నిత్యం సమీక్షలు, తనిఖీలు, పర్యటనలు చేస్తూ ప్రగతిని పరుగులు పెట్టించాలి!

# 'సిటీ ప్లానింగ్'ను ప్రక్షాళన చేయండి

## మంత్రి నారాయణకు.. నూనె మల్లికార్జునయాదవ్ వినతి

నెల్లూరు కార్పొరేషన్‌లోని సిటీప్లానింగ్ విభాగంలో భారీగా అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, పరిశీ లించి ప్రక్షాళన చేయండని జనసేన నాయకుడు, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జునయాద్ ఇటీవల మంత్రి నారాయణను కలిసి విన్నవించారు. వైకాపా హయాంలో నగరంలో అనేక పనుల్లో అవినీతి జరిగిందని, సీసీ రోడ్లు అధ్వాన్నంగా వేశారని, ఇంజ నీర్లు కాంట్రాక్టర్లు కుమ్మక్కై అందినకాడికి దోచుకున్నా రని ఆయన ఆరోపించారు. నగరంలో ఆక్రమణలు నిండిపోయి ట్రాఫిక్ సమస్యలు పెరిగాయన్నారు. రోడ్ల విస్తరణ గురించి ఆలోచించే నాధులే లేర న్నారు. పారిశుధ్య పరిస్థితి పరమఘోరంగా ఉం దన్నారు. కుక్కలు, పందుల బెడద ఎక్కువైందన్నారు కాలువల్లో పూడికతీత పనులు చేయకుండానే చేసినట్లు దొంగలెక్కలు చూపి కోట్లాదిరూపాయలు స్వాహాచేశా



రని, ఏ పనుల్లో చూసినా అవినీతి తప్ప అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ఆ వ్యవహారాలన్నిటిపై లోతుగా విచారణ జరిపించి, అక్రమాలను అరికట్టాలని ఆయన కోరారు. ఆమేరకు మంత్రికి ఆయన వినతి పత్రం సమర్పించారు.

# సాయిదర్బార్‌లో..ఉచిత నేత్రచికిత్సా శిబిరం

నెల్లూరు బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాలమందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాల సందర్భంగా శ్రీ సాయినాథుడు ఆచరించి చూపిన మానవసేవలో భాగంగా, మందిరంలోని శ్రీ సాయిమాత నిత్యాన్నప్రసా దాలయంలో ఈనెల 4 ఉచిత మెగా నేత్ర శస్త్రచికిత్సా శిబిరం నిర్వహించారు. ప్రముఖ డాక్టర్ పి.ఎల్.రావు మాదరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారి సౌజన్యంతో ఈ శిబిరం జరిగింది. దాదాపు 500మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 90 మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నారు. మందిరం ఛైర్మెన్ మధుసాయి పర్యవేక్షించారు. డాక్టర్లు భారతి, చిన్మయి, వినీల, మేనేజర్ కుమారస్వామి, మందిరం గౌరవసలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కాలువలలో..
# పూడిక తీయించండి
### బీజేపీ నాయకుడు మిడతల వినతి



జిల్లాలోని సాగునీటి కాలువల్లో వెంటనే పూడికతీత పనులు ప్రారంభించాలని బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఇటీవల ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ లవన్నకు ఆమేరకు వినతిపత్రం సమర్పించారు. జలవనరుల శాఖ అధికారులు ఏటా కోట్లాదిరూపాయలు వ్యయం చేస్తున్నా పంట కాలువలలో పూడిక అలాగే ఉంటోందని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయే తప్ప చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో 1100దాకా చెరువులు ఉన్నాయని, అయితే ఆ చెరువుల నుండి సాగునీరు పంట కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు ప్రవహించే పరిస్థితులు లేవని తెలిపారు. నీరు వదిలే సమయంలో కాలువలలో పూడికతీత పనులు ప్రారంభిస్తున్నారని, మట్టిని తీసే సమయంలో నీటిప్రవాహం వల్ల పూడిక తీయలేకపోతున్నారని ఆయన వివరించారు. జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు పుష్కలంగా లేదని, ఈ తరుణంలో పంట కాలువలలో మట్టిని తొలగించినట్లయితే చివరి ఆయకట్టు వరకు పొలాలకు నీరందించేందుకు వీలుంటుందని, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు నరాల సుబ్బారెడ్డి, కంచర్ల నారాయణ యాదవ్, ఎం.రత్నంనాయుడు, ఏ.నాగేంద్రసింగ్, కేశవ, ముని సురేష్, భాస్కర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా జనసేన సభ్యత్వాలు
### నూనె మల్లికార్జునయాదవ్



జిల్లావ్యాప్తంగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నామని జనసేన నాయకుడు, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ చెప్పారు. ఈనెల 4న నెల్లూరు రూరల్ మండలం కొత్తూరులోని రామకోటయ్యనగర్‌లో ఆయన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంపై ప్రజల్లో మంచి నమ్మకం ఉందన్నారు. ఆయనకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పార్టీ నాయకురాళ్ళు నాగరత్నం, హసీనా, ఇందిర, శాంతి, సుకన్య పాల్గొన్నారు.

# 'నీ భవిష్యత్తు నీ చేతుల్లోనే'..పుస్తకావిష్కరణ



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహం కొత్తరచన 'నీ భవిష్యత్తు నీ చేతుల్లోనే' పుస్తకాన్ని ఈనెల 4న స్థానిక శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఆవిష్కరించారు. పెన్నా రచయితల సంఘం(పెరసం) అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి, గౌరవాధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు, కార్యదర్శి తోట సులోచన, ప్రముఖ బాలసాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్, షంషుద్దీన్, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, పెరిశెట్ల శివకుమార్ తదితరులు పాల్గొని మోపూరు పెంచలనరసింహను ఘనంగా సన్మానించారు. అనంతరం, స్నేహితుల దినోత్సవం సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో అన్నం శివకృష్ణ, నాగేశ్వరమ్మ, అంకబాబు తదితరులు పాల్గొని కవితలు పఠించారు.



# క్రీడల అభివృద్ధికి చేయూతనిస్తా
### ఎంపీ వేమిరెడ్డి హామీ

జిల్లాలో క్రీడల అభివృద్ధికి చేయూతనిస్తామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇందుకూరుపేటలో ఎంకెఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 4న ఆయన పముజుల శ్రీనివాసులు, మహలక్ష్మమ్మ స్మారక 11వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులను అభినందించారు. ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలో పురుషుల విభాగంలో ప్రకాశం జట్టు విజేత కాగా, నెల్లూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళల విభాగంలో విజయనగరం జట్టు విజేతగా నిలవగా, కృష్ణాజిల్లా జట్టు రన్నరప్ స్థానాన్ని దక్కించుకుంది. ఇక్కడ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులంతా భవిష్యత్తులో మరింతగా రాణించి రాష్ట్ర జాతీయస్థాయిలో కూడా పేరొందాలని వేమిరెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తామని, ఇందుకూరుపేటలో మినీ ఇండోర్ స్టేడియం, షటిల్ కోర్టుల వంటి సౌకర్యాల కల్పనకు తనవంతు కృషిచేస్తానని ఆయన చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులిచ్చారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన దువ్వూరు కల్యాణ్‌రెడ్డిని, కమలాకర్‌రెడ్డిని, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పముజుల రవి, పవన్‌రెడ్డి, రమేష్‌నాయుడు, విజయకుమార్ తదితరులందరినీ ఆయన అభినందించారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, డిఎస్డీఓ యతిరాజ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్, మన్నెం శ్రీకాంత్, బీజేపీ నాయకుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 7 నుంచి.. వినాయకచవితి వేడుకలు
### విజయవంతం చేయాలన్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు



వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 7 నుంచి నెల్లూరులో పెద్దఎత్తున వేడుకలు నిర్వహించనున్నామని, 11వ తేదీన గణేష్‌ఘాట్ వద్ద జరిగే నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేయాలని విక్రమసింహపురి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈనెల 4న స్థానిక ట్రంకురోడ్డులోని టీవీఎస్ కల్యాణసదన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వివిధ సెంటర్లలో నిర్వహించే వినాయకచవితి ఉత్సవాలను సెప్టెంబరు7 నుంచి ఘనంగా 5 రోజుల పాటు వైభవంగా నిర్వహించుకుని, 11న నిమజ్జనోత్సవం నిర్వహించాలని సూచించారు. గత సంవత్సరం లాగానే ఈసారి కూడా అన్ని అనుమతులు సింగిల్‌విండో పద్ధతిలో తమ కార్యాలయం నుంచి నిర్వాహకులకు అందజేస్తామని తెలిపారు. వినాయక చవితి నాటికి నెల్లూరు నగరాన్ని శోభాయమానం చేసేందుకు మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితర ప్రముఖులందరినీ కలిసి వారి సహకారంతో భారీ ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఆ మేరకు అధ్యక్షులు పిట్టి సత్యనాగేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీవారు పలు తీర్మానాలు చేశారు. ఉత్సవ సమితి కార్యనిర్వహణ అధ్యక్షులు వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శి పి.సురేంద్రరెడ్డి, కొండపల్లి శ్రీకాంత్, మహేష్, యరబోలు రాజేష్, మండ్ల ఈశ్వరయ్య, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, కెవి సుబ్రహ్మణ్యం, బీవిఎస్ రంగరాజన్, పేటేటి భాస్కర్, యుగంధర్, ప్రసాద్, జగన్‌మోహన్‌రావు, హర్షవర్ధన్, కాకు మురళిరెడ్డితోపాటు వినాయకచవితి ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# కళాశాలలను తనిఖీ చేసిన.. వీఎస్‌యు వీసీ

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంజీవని డిగ్రీ కాలేజీ, రావూస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, రావూస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ స్టడీ మరియు జగన్స్ కాలేజీలను సందర్శించి, కళాశాలల్లోని మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరును ఆరాతీశారు. లోపాలను గుర్తించి ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. వెంటనే లోపాలు సరిదిద్దుకోవాలని, కళాశాలలు సమాజ నిర్మాణం కోసం పనిచేయాలని హితవు పలికారు.

## టూకీగా...



### మాలకొండస్వామికి రూ.6.9 లక్షల ఆదాయం

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలం మాలకొండలో వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా, ఈనెల 3న శనివారం ఒక్కరోజే 6,94,971రూపాయలు ఆదాయం వచ్చిందని ఆలయ డెప్యూటీ కమిషనర్ కె.బి. శ్రీనివాసరావు తెలిపారు.

### బుచ్చిలో 'అమ్మ పేరుతో ఓ మొక్క'

బుచ్చిరెడ్డిపాళెంలోని గోపాలకృష్ణయ్య స్కూల్‌లో ఈనెల 3న విద్యార్థులు 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటారు. డిఇఓ రామారావు, కమిషనర్ రమణబాబు, ఎంఇఓ రత్నం, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తిరువీధి సుబ్రహ్మణ్యం, సరాబు నాగయ్య, కరెస్పాండెంట్ ఎన్.శ్రీధర్ పాల్గొన్నారు.

### ఆత్మకూరులో ఉచిత దంతవైద్య శిబిరం

ఆత్మకూరు పట్టణంలో ఈనెల 3న స్థానిక అవినాష్ దంత వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా దంతవైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ఈ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు. డాక్టర్ అవినాష్ పాల్గొని సుమారు వందమందికి పైగానే దంత వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులిచ్చారు.

### కోవూరు కోదండరామునికి పల్లకిసేవ

మండలకేంద్రమైన కోవూరు గాంధీపార్కు కూడలి వద్ద కొలువైవున్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఈనెల 3న స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా పల్లకిసేవ నిర్వహించారు. స్థానిక భక్తమండలి వారు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పల్లకిలో ఊరేగుతున్న స్వామివారిని దర్శించుకుని తరించారు.

### ఊటుకూరు శివారుల్లో పేకాటరాయుళ్ళ అరెస్ట్

వింజమూరు మండలం ఊటుకూరు గ్రామ శివారుల్లో పేకాట శిబిరంపై ఈనెల 3న పోలీసులు దాడి చేసి 9మంది పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 27,770 రూపాయలు స్వాధీనం చేసుకున్నామని వింజమూరు ఎస్ఐ కోటిరెడ్డి చెప్పారు.

### చేజర్ల విద్యార్థులకు నోట్‌బుక్‌లు

మండల కేంద్రమైన చేజర్లలోని జూనియర్ కాలేజీ విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన నోట్‌బుక్‌లను మండల టీడీపీ అధ్యక్షుడు టీవీ నరసారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరరాఘవరెడ్డిల ఆధ్వర్యంలో ఈనెల 3న విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ దుర్గారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పెంచలకోన స్వామికి వేడుకగా కల్యాణోత్సవం

రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నృసింహస్వామికి ఈనెల 3న ఆలయ అర్చకులు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం, స్వామి-అమ్మవార్లను తిరుచ్చిపై ఊరేగించి, సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ కె.విజయసాగర్‌బాబు పర్యవేక్షించారు.

### దుండిగంలో తల్లిపాల వారోత్సవాలు

దగదర్తి మండలం దుండిగం గ్రామంలోని అంగన్‌వాడీ మెయిన్ సెంటర్‌లో ఈనెల 3న తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, తల్లిపాల విశిష్టత గురించి గర్భిణులు, తల్లులకు వివరించారు. తల్లి పాలు బిడ్డకు ఎంతో మంచివని, వ్యాధి నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యాన్నిస్తాయని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు తాగించాలని ఐసిడిఎస్ సీపీఓ కె.సౌజన్య తెలిపారు.

### సోమశిలకు పెరిగిన నీటిప్రవాహం

ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయానికి భారీగా నీటిప్రవాహం రావడంతో ఆదివారం నాటికి 7307 క్యూసెక్కుల నీటిప్రవాహం వచ్చిందని అధికారులు తెలిపారు. జలాశయం నీటి సామర్థ్యం 77.899 టీఎంసిలు కాగా, దీంతో ఇప్పుడు 11.130 టీఎంసిల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

# శ్రీరస్తు.. శుభమస్తు... కళ్యాణమస్తు!





లేట్ శ్రీ కే.వీ.రత్నం - శ్రీమతి పద్మావతి రత్నం గారల
ముద్దుల మనుమరాలు

డాక్టర్ కే.కిషోర్ - వాసంతిల కుమార్తె

## రోషిణి - ఈశ్వర్

ముచ్చటగా చేయి చేయి కలిపి
ఏడడుగులు కలసి నడచి
మూడుముళ్ళ బంధంతో
ఆలుమగలవుతున్న ఆనందవేళ
మా శుభాకాంక్షలు, శుభాశీస్సులు.



వేడుక : ఆగస్టు 09, 2024,
శుక్రవారం సాయంత్రం
వేదిక : విపిఆర్ కన్వెన్షన్ సెంటర్
నెల్లూరు.

**డా. కేశవ్ రామిరెడ్డి**
**డా. అనుపమ**
Tampa, Florida, USA

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com